సహజీవన భావనల పావురాయి

గీటురాయి

వారపత్రిక 5-12-2025 ₹ 15/-

మందానీ మంత్రం

ఆరోగ్యం: అల్లాహ్ ప్రసాదించిన అమూల్య వరం

నియంత్రణ అవసరం

గీటురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

Our Bank A/c Details:
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 47 హైదరాబాద్
శుక్రవారం 5 డిసెంబర్ 2025 రూ.15-00
జమాది ఉల్ ఆఖిర్ 13 1447 హిజ్రీ

తొలిగీటు

వస్తువు పంపకంలో మీ పిల్లలందరి పట్లా న్యాయంగా, సమానంగా వ్యవహరించండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

సంపాదకులు
ఎస్.ఎమ్. మలిక్

అసోసియేట్ ఎడిటర్
అబ్దుల్ వాహెద్

ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి
ముహమ్మద్ ముజాహిద్

గ్రాఫిక్స్
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్

సర్క్యులేషన్ మేనేజర్
అబ్దుల్ జలీల్, 9704317015

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com



కథ

26

తల్లిదండ్రుల బాధ్యత

లోపల...

సమీకరణాలు మారవచ్చు	......	04
మందానీ మంత్రం	......	05
గతంలోకి ఒక చూపు – 5	......	09
సుఖంగా ఉండండి సంతోషంగా జీవించండి	......	12
ఆరోగ్యం – అల్లాహ్ ప్రసాదించిన అమూల్య వరం	......	14
నిజమైన భక్తి అంటే....	......	16
వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం)	......	18
అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం)	......	19
ఆదర్శ పొరుగు ఆదర్శ సమాజం – 3	......	20
బరువు పెరిగిందా?	......	24
మట్టి మన ఉనికికి మూలం	......	28
నియంత్రణ అవసరం	......	30
సంక్షిప్త భారతం	......	32
సర్వత్రా	......	33
హృదయంలో దాగివున్న అద్భుత శక్తి – కృతజ్ఞత	......	34

ఇదీ సంగతి..!

స్థానిక సమరానికిక
ఊపారు పచ్చజెండా
తీపి తీపి మాటలతో
ముంచుతారు నిండా!

ప్రలోభాల వలపన్ని
రాబడతారట ఓట్లు
అభివృద్ధి ఆశజూపి
గడిస్తారు వేల కోట్లు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

సమీకరణాలు మారవచ్చు

సామ్రాజ్యాల పతనం హఠాత్తుగా జరగదు. నెమ్మదిగా ప్రారంభమవుతుంది. ఆపై అకస్మాత్తుగా కూలిపోతాయి. ఎదురులేని అధికారాన్ని చెలాయించడానికి అలవాటుపడిన అమెరికా, ఇస్రాయిల్ దేశాలు ఈ సత్యాన్ని ఇప్పుడు గ్రహించక తప్పదు. ఈ పతనం కేవలం సైనిక లేదా దౌత్యపరమైన పతనం మాత్రమే కాదు. ఇది నైతిక పతనం, నాగరికత పతనం.

ఆధిపత్యం యుద్ధాలను గెలవగలదు, కాని చరిత్రను కోల్పోతుంది. నేడు ఈ రెండు దేశాలు ప్రపంచంలో ఆధిపత్యాన్ని చెలాయించినా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి.

ఇటీవల ఇస్రాయిల్ నుంచి వలసలు పెరుగుతున్నాయి. మూడు సంవత్సరాలలో 168,000 కంటే ఎక్కువ మంది దేశం విడిచి వెళ్లారు. పౌరసత్వాన్ని రద్దు చేయాలనే అభ్యర్థనలు మూడు రెట్లు పెరిగాయి. ఒకప్పుడు అవకాశం కోసం వలస వెళ్ళిన వారు ఇప్పుడు అభద్రత, రాజకీయ పతనాల కారణంగా పారిపోతున్నారు. అక్టోబర్ 7 తర్వాత వలసలు పెరిగినట్లు కొందరి అభిప్రాయం.

ఇప్పుడు ఇస్రాయిల్‌లో జియోనిస్ట్ ప్రాజెక్ట్ పతనావస్థకు చేరుకుంటుందని అనేకుల అభిప్రాయం.

ప్రపంచ దేశాల్లో ఇప్పుడు ఇస్రాయిల్ ఒంటరిదయ్యింది. యూరోపియన్ యూదు జనాభా అధ్యయనాలు, యూరప్, ఉత్తర అమెరికాలో స్థిరపడుతున్న యూదుల జనాభా పెరుగుతున్నట్లు చూపిస్తున్నాయి. తిరిగి వచ్చే వారి కంటే ఎక్కువ మంది ఇస్రాయిల్ విడిచి వెళుతున్నారు.

ఇస్రాయిల్ పాత్రికేయుడు, రచయిత గిడియాన్ లెవీ ప్రకారం, ఇస్రాయిల్ లో ప్రస్తుత పరిస్థితి స్థిరంగా లేదు. సైనిక శక్తి, ఆక్రమణ, పాలస్తీనియన్లకు హక్కులను నిరాకరించడం కొనసాగిస్తే చివరికి పతనాన్ని ఎదుర్కొంటుంది.

అమెరికా వేరే తుఫాను ఎదుర్కొంటుంది. ఒకప్పుడు ప్రపంచ ప్రతిభను ఆకట్టుకోవడంలో గర్వపడిన దేశం ఇప్పుడు వలసదారులను శత్రువులుగా చూస్తోంది. వలసదారులచే నిర్మించబడిన సమాజం ఇప్పుడు వారి నుండి వేరుపడాలని చూస్తోంది. మరోవైపు మందానీ వంటి ముస్లిం ప్రగతిశీల నేత ఎన్నికయ్యారు.

అమెరికా, ఇస్రాయిల్ దేశాల సంక్షోభం అకస్మాత్తుగా రాలేదు. జాతి ఆధిపత్యంతో కట్టుకున్న సామ్రాజ్యాలు చివరికి మానవీయ విలువల భారం కింద కూలిపోతాయి. యూదులు, ముస్లింలను స్పెయిన్ బహిష్కరించడం నుండి దక్షిణాఫ్రికా వర్ణవివక్ష వరకు, బహిష్కరణ సాధించింది కుప్పకూలే వ్యవస్థలనే. బహిష్కరణ ప్రతిఘటనకు దారితీస్తుంది.

ఇస్రాయిల్, అమెరికా దేశాలు బలహీనంగా ఉండడం వల్ల పతనం కావడంలేదు. చరిత్రలో తప్పులు చేస్తున్నందువల్ల పతనమవుతున్నాయి. ఇస్రాయిల్ అపారమైన శక్తి ఉన్నప్పటికీ గాజాలో తన వ్యూహాత్మక లక్ష్యాలను సాధించలేదు. అది సైనికంగా అలసి పోయి, రాజకీయంగా ఒంటరిగా, నైతికంగా అపకీర్తి పాలై నిలబడింది. నియంత్రణను కొనసాగించడానికి నిరంతరం క్రూరత్వాన్ని పెంచాల్సిన అవసరం ఉన్న రాజ్యం సురక్షితంగా ఉండలేదు – అది నిస్సహాయంగా మిగిలిపోతుంది.

అమెరికా ఆంక్షలు, ప్రాక్సీ యుద్ధాలు, ఆర్థిక నిర్బంధాలు ఎల్లవేళలా పనిచేయవనే సత్యాన్ని కనుగొంటోంది. గ్లోబల్ సౌత్ పాశ్చాత్య సంరక్షణ నుంచి బయటపడుతోంది. అమెరికన్ భ్రమ ముగిసింది.

ఈ పతనం నైతికమైనది. అమెరికా బహుళత్వాన్ని కాదంటోంది, ఇస్రాయిల్ సహజీవనాన్ని వద్దంటోంది. రెండూ న్యాయానికి బదులు ఆధిపత్యాన్ని ఎంచుకున్నాయి. ఎంత ఎక్కువ బలాన్ని నమ్ముకుంటారో అంతగా పతనం సమీపిస్తుంది.

పతనం అనేది కేవలం ముగింపు మాత్రమే కాదు, కొత్త ప్రారంభం అవుతుంది. భవిష్యత్తు ఆధిపత్యం చెలాయించే వారికి కాదు, శాంతియుత సహజీవనం చేసేవారికి చెందుతుంది. భయం ద్వారా పాలించే వారికి కాదు, అధికారాన్ని మానవీకరించే వారికి చెందుతుంది.

అబ్దుల్ వాహెద్

మందానీ మంత్రం

న్యూయార్క్ సిటీ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మందానీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో అత్యంత ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చాడు. రాజకీయ విశ్లేషకులు, రాజకీయ నేతలు ఎవ్వరూ ఊహించని పరిణామం ఇది. ఇదెలా సాధ్యపడిందో చాలా మందికి అర్థం కాలేదు. జనాకర్షణ కలిగిన విజేత పట్ల సానుకూల ప్రతిస్పందన ద్వారా ట్రంప్ తన ప్రజాదరణ తగ్గకుండా జాగ్రత్తపడ్డారని కొందరు విశ్లేషించారు. ట్రంప్, మందానీ ఇద్దరి మధ్య ఒక సయోధ్యకు ఇది సూచనగా కొందరు తీర్మానించారు. ఈ భేటీ భారతీయ సంతతికి చెందిన ప్రత్యేకమైన నైపుణ్యాన్ని ప్రదర్శించిందని కొందరన్నారు.

మందానీ ముఖాన మర్యాదపూర్వక చిరునవ్వు, పెద్దల పట్ల చూపించే గౌరవం, తలను కొద్దిగా వంచి మాట్లాడడం, ట్రంప్‌ను శాంతపరిచే వైఖరి ఇది భారత ఉపఖండం మూలాలున్న వారి ప్రత్యేకత. సాధారణంగా పెద్దవారి పట్ల ప్రదర్శించే సంస్కారం అనవచ్చు లేదా వ్యూహాత్మక వినయం అనవచ్చు.

జోహ్రాన్ చేసింది భారతీయ సంస్కారంలో తరతరాలుగా కొనసాగుతూ వస్తున్నదే. పెద్దల మాట వింటూనే మన మాటను చాకచక్యంగా ఒప్పించుకోవడం. ఇది దేశీ కళ అని కొందరు అభిప్రాయపడ్డారు. వ్యవస్థను మార్చడం మాకు తెలుసు. మా పెద్దల పట్ల గౌరవాన్ని చూపిస్తూనే మేము పెరిగిన వ్యవస్థతో ఎలా మెలగాలో మాకు తెలుసు అని భారతీయ సంతతికి చెందిన నటి, గాయని యమునా మేలెత్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. దక్షిణాసియా ప్రజలకు మందానీ ముఖాన ప్రవర్తనలో సుపరిచితమైన చిరునవ్వు చూశారు. ట్రంప్‌తో ప్రాథమిక విభేదాలను హైలైట్ చేయడానికి ఉద్దేశించిన ప్రశ్నలను అతను చాకచక్యంగా పక్కకు మళ్ళించాడు.

ట్రంప్ విషయంలో మందానీ వ్యవహరించిన శైలిని చాలా మంది భారతీయ సంతతిలో ఉండే ప్రత్యేకతగా భావిస్తున్నారు. సాధారణంగా పెద్దలు అడగకుండా ఇచ్చే సలహాలను యువత ఇలాగే ఎదుర్కొంటారని యమునా మేలెత్ అన్నారు. ఓర్పుగా పెద్దల మాట వింటూ, ఒక చెవితో విని మరొక చెవితో వదిలేయడం కూడా జరుగుతుంది అన్నారామె. పెద్దలు మెచ్చుకునేలా వ్యవహరిస్తూనే తమ మాటను వినేలా ఒప్పించుకునే ఈ కళ బహుశా పాశ్చాత్యులకు కొత్తది. ట్రంప్‌తో సమావేశంలో మందానీ ఇదే చేశారని కొందరి అభిప్రాయం. న్యూయార్క్ సిటీ ట్రంప్‌ను ప్రేమిస్తుందా అని అడిగినప్పుడు, ఆయన వెంటనే జీవన వ్యయంపై మాట్లాడారు. ట్రంప్ 2024లో జీవనవ్యయం గురించి మాట్లాడి న్యూయార్క్ వాసుల

మద్దతు పొందారని గుర్తుచేశారు. ఆ వెంటనే ధరల తగ్గింపు గురించి మాట్లాడారు. ట్రంప్ ముఖాన సంతోషం కనిపించింది. మందానీ భావాలు కొన్ని నిజంగా నాకు ఉన్న ఆలోచనలే అని కూడా ట్రంప్ చెప్పారు. మందానీ గొప్పగా పని చేయాలని కోరుకుంటున్నాను, మేము సహాయం చేస్తాం అని కూడా ట్రంప్ చెప్పారు.

మందానీ ట్రంప్‌తో సమావేశం కావడాన్ని వామపక్షవాదులు కొందరు విమర్శించారు. కాని మేయర్‌గా ఎన్నికైన వ్యక్తి ఎలాంటి రాజీ పడ కుండా మొండిగా వ్యవహరించే వ్యక్తిని నిరాయుధుడిగా చేశాడని చాలా మంది ప్రశంసించారు. కమ్యూనిస్ట్ జిహాదీగా చిత్రీకరించ డానికి మితవాదులు చేసిన ప్రయత్నంపై చావుదెబ్బ కొట్టాడు. న్యూయార్క్ నగరంలో నేషనల్ గార్డ్‌ను మోహరించవచ్చనే భయాలు తగ్గించాడు.

సాధారణంగా పాశ్చాత్య సమాజాలు సూటిగా, ప్రత్యక్ష సంభాషణను ఇష్టపడతాయి. కాని ప్రాచ్య సంస్కృతులు అలా సూటిగా మాట్లాడ డాన్ని ఇష్టపడవు. ప్రాచ్య సాంస్కృతిక మూలాలున్న వారు పెద్దలను బాధించ కుండా తమ మాటపై నిలబడడానికి సున్నితమైన సమతుల్యతను పాటించడం జరుగుతుంది. ఇది భారత ఉపఖండంలో ప్రత్యేకంగా చూడవచ్చు.

ట్రంప్‌తో ఇతర ప్రముఖ నాయకుల సమావేశాల్లో ఘర్షణాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. మందానీతో సమావేశం కూడా అలాంటి మరో ఉదాహరణ అవుతుందని చాలా మంది అనుకు న్నారు. ఫిబ్రవరిలో, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో ట్రంప్ భేటీ వాగ్వాదానికి దారితీసింది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా ఓవల్ ఆఫీస్ సందర్శన కూడా ఇలాగే ముగిసింది.

ట్రంప్ తన సొంత రాజకీయ ప్రయోజనాల కోసం చూస్తారన్నది స్పష్టం. మందానీతో స్నేహపూర్వక వైఖరి ప్రదర్శించడం రాజకీయ వ్యూహం కూడా కావచ్చు.

న్యూయార్క్ మేయర్ ఎన్నిక ప్రచారంలోను, మేయర్‌గా ఎన్నికైన తర్వాత కూడా మందానీ చాలా స్పష్టంగా, చాలా తీవ్రంగానే ట్రంప్‌పై దాడిచేశాడు. వాల్యూమ్ పెంచండి... అంటూ తన ప్రసంగంలో సూటిగా ట్రంప్‌ను ఉద్దేశించి మాట్లాడాడు. మందానీ మాటలు వినడానికి ట్రంప్ వాల్యూమ్ పెంచుకున్నాడా అనిపిస్తుందిప్పుడు. కోపంగా బెదిరింపు ధోరణిలో మాట్లాడే ట్రంప్ అంకుల్ వైట్‌హౌస్‌లో మందానీతో సమావేశం తర్వాత అభిమానించే, ప్రేమించే అంకుల్‌గా మారిపోయాడు. మందానీ మాటలు శ్రద్ధగా విన్నాడు. అంతకన్నా శ్రద్ధగా మందానీ కూడా ట్రంప్ మాటలు విన్నాడు. ఇది చమత్కారానికి తక్కువ కాదు.

మందానీ స్వయంగా ట్రంప్‌తో సమావేశం కావాలని కోరాడు. అంతకుముందు వారిద్దరు ఒకరినొకరు తిట్టిపోసుకున్నారు. మందానీ "కమ్యూనిస్ట్, జిహాదిస్ట్" అని ట్రంప్ విమర్శిస్తే, ట్రంప్ "ఫాసిస్ట్ నియంత" అని మందానీ ఎదురు దాడి చేశాడు. ఈ సమావేశం తర్వాత ఇప్పుడు కూడా ట్రంప్ ఫాసిస్ట్ అని భావిస్తున్నారా అని పాత్రికేయులు అడిగినప్పుడు మందానీ జవాబు చెప్పకముందే, మందానీ తన అభిప్రాయాల విషయంలో రాజీపడడని అర్థమైన ట్రంప్ "అవునని చెప్పండి, మరేం ఫర్వాలేదు, ఇప్పుడు వివరణ ఇవ్వవలసిన అవసరం లేదు" ఒకవిధమైన వాత్సల్యంతో మందానీని భుజం తడుతూ చెప్పిన మాటలు ఈ మొత్తం సమావేశంలో హైలైట్.

ట్రంప్ సమావేశానికి అంగీకరించిన తర్వాత మందానీ తాను న్యూయార్క్ కోసం తన వాదన వినిపించడానికి వెళ్తున్నానని, తన మద్దతుదారులకు అండగా ఉంటానని, ఎలాంటి పరిణామాలకైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టంగా చెప్పి వైట్ హౌస్‌కు వెళ్ళాడు. వైట్ హౌస్‌లో జరిగిన ట్రంప్–జెలెన్ స్కీ సమావేశాన్ని ప్రజలు మరిచి పోలేదు.

ఈ సమావేశం తర్వాత మీడియా ఇంటరాక్షన్‌లో వచ్చిన పాత్రికే యులు దాదాపు అందరు ట్రంప్ సమర్థకులే. మందానీని ఇరుకున పెట్టే ప్రశ్నలతో వచ్చారు. ఫాక్స్ న్యూస్ ఈ సమావేశం గురించి మాట్లాడుతూ ఈ సమావేశం తర్వాత మందానీ చిన్నాభిన్నం అవుతాడని అంచనా వేసింది. కాని పెద్ద షాక్ మీడియాకు కూడా తగిలింది.

న్యూయార్క్ నగర మేయర్‌గా ఎన్నికైన మందానీ ట్రంప్‌ను మంత్ర ముగ్ధుడు చేస్తాడని ఎవరూ ఊహించలేదు. మందానీ ముఖంపై మర్యాదపూర్వకమైన, దృఢమైన, కోపం లేని, చిరునవ్వు, మొండితనం లేని వ్యక్తిత్వం అమెరికా అధ్యక్షుడిని కదిలించినట్లు స్పష్టంగా కనిపించింది. ఇది వ్యూహాత్మకంగా ట్రంప్ ఎత్తుగడ కావచ్చేమో కాని, నిజంగా ఆయన మందానీ పట్ల సమ్మోహితుడయ్యాడన్నది ఆయన హావభావాల్లో స్పష్టంగా కనిపించింది. ఆ సమావేశం తర్వాత ట్రంప్ నవ్వుతూ బయటకు వచ్చి, మందానీతో పదేపదే కరచాలనం చేయడం, స్నేహపూర్వకంగా భుజం తట్టడం ఇవన్నీ ట్రంప్‌పై మందానీ మంత్రం పనిచేసిందనడానికి నిదర్శనాలు.

"మీరు ఇప్పటికీ ట్రంప్‌ను ఫాసిస్ట్‌గా భావిస్తున్నారా? అని మందానీని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ ప్రతిస్పందన చాలా కీలకమైనది. ఈ ప్రశ్నకు సామరస్యంగా జవాబు ఉండేలా ట్రంప్ సహాయం చేశాడు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో అమెరికా అధ్యక్షుడి పక్కన నిశ్శబ్దంగా నిలబడిన మందానీకి ఇబ్బందికరమైన ప్రతి ప్రశ్నలోను ట్రంప్ జోక్యం చేసుకున్నాడు. ప్రచారంలో ఉపయోగించిన పదాలకు ఖచ్చితంగా ఎటువంటి అర్థం ఉండకపోవచ్చని కొట్టి పారేశారు. మందానీని 'జిహాదిస్ట్' అని పిలవడానికి నిరాకరించడమే కాదు,

మందానీ చాలా హేతుబద్ధంగా ఉన్నాడని చెప్పారు. ప్రశ్నలు అడుగుతున్నప్పుడు మందానీ వైపు ట్రంప్ నవ్వుతూ చూస్తూ, ప్రోత్సాహకరమైన మాటలు చెబుతూ, అతనితో ఇంకా సమయం గడపాలన్నట్లు కనిపించారు. ఏ విధంగానూ అది నటనలా అనిపించలేదు. ఈ తెలివైన రాజకీయ నాయకుడు హఠాత్తుగా మందానీ పట్ల మొగ్గు చూపించడానికి మందానీ చరిష్మా ఒక కారణం కావచ్చు కాని దాంతో పాటు రాజకీయ లెక్కలు ఖచ్చితంగా ఉంటాయి.

ఆ మంత్రం ధరలను అందుబాటులో ఉండేలా చూస్తామన్న హామీ. ఇది అర్థం కావాలంటే న్యూయార్క్‌లో మందానీ కేవలం ఒక శాతం రేటింగ్‌తో ఎవరికీ తెలియని రోజుల్లో, ఒక సంవత్సరం క్రితం ఏం జరిగిందో పరిశీలించాలి. ట్రంప్ తన ఎన్నికలలో పెద్ద విజయాన్ని సాధించిన న్యూయార్క్‌లో మందానీ కాలి నడకన తిరిగాడు. ఓటర్లు ట్రంప్‌కు ఎందుకు మద్దతు ఇచ్చారో తెలుసుకోవాలనే ఈ ప్రయత్నంలో, మందానీకి జీవనోపాధి సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, భద్రత, ధరలు వంటి సమస్యలు తెలిశాయి. వీటిని తన ప్రచారానికి ప్రధానాంశంగా మార్చాడు. జీవనోపాధి, ధరల విషయంలో ట్రంప్ చేసిన ప్రచారం వల్లనే న్యూయార్క్ ప్రజలు ట్రంప్‌కు ఓటు వేశారు. మందానీకి, ట్రంప్‌కు మధ్య ఇది ఉమ్మడి అంశం. దీన్ని ట్రంప్ కాదనలేదు. ఇదే ట్రంప్‌తో సమావేశంలో కీలకమైన అంశంగా మందానీ వాడుకున్నాడు. ఈ అజెండాకు ట్రంప్ మద్దతు ఇస్తే తాను ఆయనతో కలిసి పనిచేస్తానని స్పష్టంగా వాక్చాతుర్యంతో ట్రంప్‌ను ఒప్పించాడు. కాగా ట్రంప్ వ్యాపారి. మంచి ఆర్థిక విధానాలను ఇష్టపడతాడు. ప్రజలు తనను నియంత అని పిలిచినా పట్టించుకోడు. జేడీ వాన్స్ ఒకప్పుడు ఆయనను అడాల్ఫ్ హిట్లర్‌తో పోల్చి నాజీ అని పిలిచాడు. కానీ తర్వాత వాన్స్‌ను తన ఉపాధ్యక్షుడిగా నియమించుకున్నాడు ట్రంప్. కాబట్టి ఆయన తనపై విమర్శలను అంతగా పట్టించుకోడు. ఈ విమర్శలు ట్రంప్‌కు సమస్య కాదు.

మందానీలో బహుశా ట్రంప్ నిజాయితీ చూశాడు. ధైర్యంగా, బలంగా తన వాదన వినిపించే వాక్చాతుర్యాన్ని చూశాడు. బలహీనులను బెదిరించే ట్రంప్ తనకు ఎదురు నిలిచి ధైర్యంగా నిలబడిన వారిని ఇష్టపడతారనేది చాలా సార్లు స్పష్టమయ్యింది. అందుబాటులో ధరలు, ప్రజల భద్రత కోసం మందానీ ప్రణాళికలు ట్రంప్ కు నచ్చాయన్నది స్పష్టం. అమెరికా అధ్యక్షుడు ప్రస్తుతం ప్రజాదరణ రేటింగ్‌లు వేగంగా పడిపోవడంతో గందరగోళంలో ఉన్నాడు. అతని సొంత మద్దతుదారులు అతని విధానాలను ప్రశ్నించడం ప్రారంభించారు. టారిఫ్‌లు అతను ఆశించిన విధంగా పనిచేయడం లేదు. ఇమ్మిగ్రేషన్ చర్యల విషయంలో కూడా వ్యతిరేకత ఎదురవుతోంది. స్వయంగా ట్రంప్ టీము అధ్యక్షుడి రేటింగు పెంచడానికి ఎలాంటి వినూత్న ఆలోచనలతో ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో న్యూయార్క్ విషయంలో మందానీ సుడిగాలిలా కొత్త ఆలోచనలతో వచ్చాడు. దానికి ఫెడరల్ సహాయం అవసరం. లేకపోతే మందానీ ఏమీ చేయలేడు. సహాయపడితే రాజకీయంగా ట్రంప్‌కు కూడా ప్రయోజనకరమే. న్యూయార్క్‌లో వలస వ్యతిరేక ముసుగు ధరించి అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని మందానీ స్పష్టం చేశాడు. ట్రంప్ దానిని సవాలు చేయలేదు. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహు న్యూయార్క్‌లోకి ప్రవేశిస్తే అరెస్టు చేయడం గురించి, అంతర్జాతీయ చట్టాలతో సహా అన్ని చట్టాలను పాటించే నగరంగా న్యూయార్క్ ఉంటుందని మందానీ అన్నాడు. గాజాలో ఇజ్రాయిల్ వైఖరిని విమర్శించాడు. ట్రంప్ విభేదించలేదు, నిశ్శబ్దంగా విన్నారు. స్పష్టంగా, ట్రంప్ ఆశిస్తున్నదేమంటే న్యూయార్క్ నగరం రెండవసారి ట్రంప్ అధ్యక్షుడయ్యేలా చేసింది. ప్రస్తుతం ట్రంప్ ఇరుక్కున్న రాజకీయ ఊబి నుంచి బయటపడడానికి న్యూయార్క్ ఉపయోగపడుతుందన్న ఆలోచన ఉండవచ్చు. మందానీ నిజాయితీ, తెలివితేటలు, నిబద్ధత స్పష్టంగా అతనికి అర్థమయ్యాయి. అంటే ఈ యువ మేయర్‌కు సహాయపడాలని నిర్ణయించుకున్నాడు. మందానీ చరిష్మా ఎంత పని చేసిందో, ట్రంప్ రాజకీయ లెక్కలు కూడా అంతే పనిచేశాయి. వైట్‌హౌస్ మీడియా ముందు తాను సోషలిస్ట్ డెమొక్రాట్ అని ప్రకటించి, రాజీ పడకుండా మందానీ వ్యవహరిస్తూనే ట్రంప్‌తో ఉమ్మడి అంశాల్లో ట్రంప్‌ను ప్రశంసిస్తూ అద్భుత చాకచక్యాన్ని ప్రదర్శించాడు. మందానీ న్యూయార్క్ విషయంలో హామీలు నిలబెట్టుకుంటే, అతనికి సహాయపడిన ట్రంప్‌కు కూడా రాజకీయంగా లాభమే. అయితే డెమొక్రాట్‌లు మందానీకి దూరంగా ఉన్నారు. ప్రచారంలో ఎటువంటి మద్దతు ఇవ్వలేదు. అతను పార్టీ టికెట్‌పై పోరాడాడు, ప్రైమరీని గెలుచుకున్నాడు, ఇవన్నీ ప్రాథమికంగా అతని స్వంత టీము వల్ల, అతని వ్యక్తిగత ప్రతిభ వల్ల జరిగాయి. పార్టీ నుంచి సహకారం లేదు. మందానీ పార్టీ నిర్మాణానికి బయట నిలబడి కనిపిస్తున్నాడు. ట్రంప్‌ను ఎలా ఎదుర్కోవాలో నిజానికి డెమొక్రాట్లు మందానీ నుంచి నేర్చుకోవచ్చు. కాని వారు దానికి సిద్ధంగా ఉన్నారా అన్నది అనుమానం. కాని ట్రంప్ మాత్రం మందానీ నుంచి ప్రయోజనాలు పొందడానికి సిద్ధ పడిన వ్యాపారి.

న్యూయార్క్ నగరంలో మేయర్‌గా మందానీ సాధించిన విజయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం. సంవత్సరం క్రితం అసాధ్యంగా కనిపించిన ఫలితాన్ని నైతిక ధైర్యంతో, ఉత్సాహంతో సాధించాడు. న్యూయార్క్ మేయర్ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో కూడా తన విధానాల పట్ల ఆయన రాజీ చూపించలేదు. భారతదేశంలో ప్రతిపక్షాలకు కూడా ఇందులో నేర్చుకోవలసిన విషయాలున్నాయి.

మందానీ తన ముస్లిం గుర్తింపును గర్వంగా చెప్పుకున్నాడు. తన మతపరమైన గుర్తింపు విషయంలో డిఫెన్సివ్‌గా వ్యవహరించలేదు. 9/11 తర్వాత అమెరికాలో, ముస్లిం వ్యతిరేకత, ద్వేషం పాతుకు పోయాయి. మందానీ ఉగ్రవాదానికి మద్దతిస్తాడని, షరియా చట్టాన్ని తీసుకువస్తాడని సోషల్ మీడియా హోరెత్తింది. మందానీ వెనక్కి తగ్గలేదు. "నేను ముస్లింని. నేను ప్రజాస్వామ్య సామ్యవాదిని" అని స్పష్టంగా ప్రకటించాడు. "మా అమ్మ వైపు కుటుంబం హిందూ" అని స్పష్టం చేశాడు. మందానీ తన ప్రచారంలో తరచుగా తన కుటుంబం ఎదుర్కొన్న వివక్ష గురించి చెప్పేవాడు. మందానీ తన మత విశ్వాసాన్ని న్యాయం, సంఘీభావం, సామాజిక సంరక్షణ పట్ల నైతిక నిబద్ధతకు కేంద్రంగా చేయడంలో విజయం సాధించాడు. అమెరికన్ ముస్లిం రాజకీయ నాయకులు ఎన్నికలలో గెలవాలంటే మతపరమైన గుర్తింపు ప్రదర్శించడం మంచిది కాదనే భావాన్ని తునాతునకలు చేశాడు. మందానీ "బహుళ-సాంస్కృతికత"ను గట్టిగా చెప్పాడు. ఇది మత విశ్వాసాన్ని తిరస్కరించడం కాదు, ప్రతి విశ్వాసాన్ని సమానంగా అంగీకరించడం, విశ్వాసం లేకపోవ డాన్ని కూడా అంగీకరించడం. తన ప్రచారంలో మసీదులు, చర్చిలు, సినాగోగ్‌లు, హిందూ దేవాలయాలు, గురుద్వారాలను సందర్శిం చాడు. హిందీ-ఉర్దూ, బెంగాలీ, స్పానిష్, అరబిక్ భాషలలో అనర్గ ళంగా మాట్లాడగల మందానీ ప్రచారంలో ఇంటింటికి వెళ్లేటప్పుడు నమ్మశక్యం కాని వైవిధ్యం కలిగిన ప్రజలతో సులభంగా సంభా షించాడు. పాలస్తీనా హక్కులకు బహిరంగంగా మద్దతు ఇచ్చాడు. ఇస్రాయీల్‌ను తీవ్రంగా విమర్శించాడు. గాజాపై చేస్తున్న యుద్ధాన్ని మారణహోమంగా అభివర్ణించడం రాజకీయంగా అమెరికాలో ఆత్మహత్యాసదృశం అనుకున్నారందరు. న్యూయార్క్‌లో యూద జనాభా ఎక్కువ. మందానీ పాలస్తీనాకు బాహాటంగా మద్దతు ఇచ్చాడు. రాజకీయాల కోసం రాజీ పడలేదు. ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు న్యూయార్క్‌లోకి ప్రవేశిస్తే అరెస్టు చేస్తానని చెప్పాడు. నవంబర్ 2024లో ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ అతనిపై జారీ చేసిన అరెస్టు వారెంట్‌ను అమలు చేస్తానని చెప్పాడు. అయితే దాంతో పాటు న్యూయార్కులో యూదు వ్యతిరేకతను తీవ్రంగా ఖండించాడు. మతతత్వ రాజకీయాలను ఎలాంటి శషభిషలు లేకుండా వ్యతిరేకించాడు. మోడీని బహిరంగంగా విమర్శించడం వల్ల మందానీకి హిందు అమెరికన్ల ఓట్లు లభించవని చాలా మంది భావించారు. అమెరికన్ రాజకీయాలలో కమ్యునిస్టుగా ముద్రపడితే రాజకీయంగా అంతమైనట్టే. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇతర రిపబ్లికన్లు అతన్ని కమ్యూనిస్ట్ అని పిలిచారు. అసమానతలను తగ్గించడం, ధనవంతులపై పన్ను విధించడం వంటివి మందానీని వ్యతిరేకించే అభ్యర్థులకు మద్దతు ఇవ్వడానికి 26 మంది బిలియనీర్లు వి-22 మిలియన్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిసింది. న్యూయార్క్ నివాసితుల జీవన వ్యయ సంక్షోభాన్ని పరిష్కరించడానికి మందానీ చెప్పిన మాటలు ప్రజలు నమ్మారు.

న్యూయార్క్ మేయర్‌గా గెలిచిన తర్వాత తన ప్రసంగంతో అందరినీ ఆకట్టుకున్న మందానీ ఆ తర్వాత ట్రంప్‌తో సమావేశం కోరి ట్రంప్‌ను మంత్రముగ్ధుడిని చేసి మరోసారి ఆకట్టుకున్నారు. ట్రంప్ హావ భావాల్లో నటన కనిపించలేదు. కాని మందానీతో సఖ్యత విషయంలో ట్రంప్ రాజకీయ లెక్కలు కూడా కొన్ని మాట్లాడుకోవడం అవసరం.

ట్రంప్ మందానీ సమావేశం ఒక ముఖ్యమైన సంఘటన అయితే, మరో ముఖ్యమైన సంఘటన మార్జోరీ టేలర్ గ్రీన్ రాజీనామ.

ఈ రెండు సంఘటనలు పరిపాలనా వ్యవస్థలో గందరగోళంగా కనిపించవచ్చు, కాని ఈ రెండింటి మధ్య సంబంధం ఉందని కూడా లోతుగా చూస్తే అర్థమవుతుంది. అమెరికాలో మాగా శిబిరంలో తిరుగుబాటును కప్పిపెట్టే ఎత్తుగడలు కూడా కావచ్చు. 2024 ట్రంప్ ఓటర్లలో చాలా మంది ఇప్పుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన అన్ని పత్రాలు బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. దానివల్ల అధ్యక్షుడికి దగ్గరగా ఉన్న వ్యక్తులు ఇరుక్కునే ప్రమాదం ఉన్నా సరే అన్నీ బయటపెట్టాలంటున్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అని ఓట్లు వేసిన రిపబ్లికన్‌లలో 57% మంది ట్రంప్ తన స్నేహితులను రక్షించడానికి ప్రయత్నిస్తున్నారని భావిస్తున్నారు. ఎప్‌స్టీన్ వివాదం విస్తృత MAGA సంక్షోభంతో ముడిపడిపోయింది. ఈ నేపథ్యంలో దృష్టి మళ్ళింపు ఎత్తుగడగా మందానీ సమావేశం సంచలనం సృష్టిం చిందని కొందరి అభిప్రాయం. కమ్యూనిస్ట్ పిచ్చి వాడిని ఎన్నుకుంటే న్యూయార్క్‌కు నిధులను నిలిపివేస్తానని బెదిరించిన ట్రంప్ మందానీతో నవ్వుతూ మాట్లాడడం ఉద్దేశపూర్వక దృష్టి మళ్ళింపుగా చాలా మంది భావిస్తున్నారు. ట్రంప్ చాలా తెలివైన నాయకుడని, మందానీతో స్నేహం సంచలనంగా చాలా సమస్యలను చాపక్రిందకు ఊడ్చేశారని అంటున్నారు. ట్రంప్ మైత్రి తర్వాత బహుశా మందానీ ఎప్‌స్టీన్ ఫైళ్ళ విషయంలో మౌనం వహించవచ్చు. అలాగే గ్రీన్ రాజీనామా తర్వాతి పరిస్థితిని కూడా ఈ సంఘటన మరిచిపోయేలా చేసింది. అయితే మాగాలో తిరుగుబాటు లోలోన రాజుకుంటూనే ఉంది. ముఖ్యంగా మందానీతో స్నేహాన్ని కూడా మాగా భరించే స్థితిలో లేదు. మందానీని ఆకర్షించడం, గ్రీన్‌ను బహిష్కరించడం ద్వారా ట్రంప్ ఇప్పుడు కొంత సమయం తనకు లభించేలా చేసుకున్నాడు. ఈ సమయాన్ని ఫిర్యాదులను పరిష్కరించడానికి ఉపయోగిస్తారా లేక నియంత్రణను పటిష్టం చేయడానికి ఉపయో గిస్తారా అనేది కాలమే చెప్పాలి. ట్రంప్‌తో స్నేహం వల్ల మందానీకి ఏం లభిస్తుందో కూడా కాలమే చెప్పాలి.

✤ ✤ ✤

5

గతంలోకి ఒక చూపు..

ఎమర్జెన్సీలో నేను

ఎస్.ఎమ్.మలిక్

ప్రజాస్వామిక ప్రభుత్వ నిరంకుశ చర్య

1971లో భారత దేశం, పాకిస్తాన్ విభజన, బంగ్లాదేశ్ ఆవిర్భావానికి తోడ్పడిన సందర్భంలో భారత ప్రధాని, ఢిల్లీలో ఓ బహిరంగ సభలో, బహుశా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం ప్రకారం, అతి కష్టం మీద జమాఅతె ఇస్లామీ హింద్ పేరు పలికి, “ఇటువంటి సంస్థల వల్ల దేశ ప్రగతి కుంటుపడుతోంది” అని హెచ్చరించారు. అప్పుడే తేలిపోయింది, ఏదో చేయబోతున్నారని! అలాగే ఏలినవారు జమాఅత్ నాయకుల్ని నిర్బంధంలోకి తీసుకుని తిహార్ జైల్లో పెట్టారు. ఆ రోజుల్లో నేను జమాఅత్ కేంద్ర కార్యాలయంలో పని చేస్తున్నాను. అప్పుడు కోర్టులో, ఆ చర్యలకు వ్యతిరేకంగా, ఏ కారణమూ తెలుపకుండానే జమాఅత్ నాయకుల్నీ నిర్బంధంలోకి తీసుకోవడం పట్ల అప్పీలు చేశాము. ఆ తరువాత కొన్నాళ్ళకే జమాఅత్ నాయకుల్ని విడుదల చేసింది ప్రభుత్వం.

1974 జనవరి నెలలో బహుశా మొదటి వారంలో, ఆనాటి అమీర్ ఎ హల్కా, మౌలానా అబ్దుర్రజ్జాక్ లతీఫీ ఆదేశం మేరకు నేను పిల్లాజెల్లాతో హైదరాబాద్‌కు వచ్చేశాను. “ఫతహ్ దర్వాజా”లో, ముందే చేసుకున్న ఏర్పాటు ప్రకారం, అద్దె ఇంటిలో సెటిల్ అయ్యాము. సైకిల్ ద్వారా ఆఫీసు, పురానీ హవేలికి రాకపోకలు కొనసాగాయి. పురానీ హవేలిలో జమాఅత్ ఏర్పాటు చేసిన “ముస్లిమ్ మెటర్నిటీ అండ్ జనానా జనరల్ హాస్పిటల్” బిల్డింగ్‌లో ముందు భాగాన జమాఅత్ హల్కా ఆఫీసు ఉండేది. ఆ ఆఫీసులోనే ఒక చిన్న రూము నాకు ఇచ్చారు, అనువాదం పని చేసుకునేందుకు.

జమాఅత్ పైన ప్రభుత్వ దృష్టి

1974 నవంబర్ నెలలో ఢిల్లీ, గాంధీ దర్శన్ మైదానంలో జమాఅత్ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ జరిగింది. అందులో ఆంధ్రప్రదేశ్ సభ్యులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ఓ ప్రత్యేక ట్రైన్ బుక్ చేసుకుని ఢిల్లీ వెళ్ళారు. ఆ రోజుల్లో అమితంగా సిగరెట్లు త్రాగే అమీర్ హల్కా మౌలానా అబ్దుర్రజ్జాక్ లతీఫీ గారు శ్వాస నాళం క్యాన్సర్ వ్యాధికి గురయి ఉన్నారు. ఆయన మటుకు ఫ్లైట్‌లో ఢిల్లీ వచ్చారు. ఆ సందర్భంలో నేను తెలుగు పబ్లికేషన్స్ తరఫున పెట్టే స్టాల్ నిర్వహణ కొరకు ఇద్దరు మిత్రులతో కలిసి ఢిల్లీ వెళ్ళాను. ఆ కాన్ఫరెన్స్‌లో విదేశాల నుండి కూడా అనేక మంది ముస్లిమ్ నాయకులు పాల్గొన్నారు. ముందు నుంచే జమాఅత్ పట్ల దురభిప్రాయం గల ప్రభుత్వం, ఈ కాన్ఫరెన్స్ తరువాత జమాఅత్ పట్ల మరింత ఆగ్రహం పెంచుకుంది.

నేను ఫతహ్ దర్వాజాలో ఉంటూ సంవత్సర కాలం గడిచి ఉంటుంది, ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చింది. లాల్ దర్వాజాకు మారాము. లాల్‌దర్వాజా ఇల్లు హాఫిజ్ అన్వారుల్లాహ్ మహ్మూద్ గారిది. ఆయన అప్పుడు హైదరాబాద్ నగర అమీర్ ముకామీ. మా పిల్లలతోపాటు మా చెల్లి రషీదా కూతురు సఫియ్యా కూడా మా వద్ద ఉండేది. మా పెద్ద పాప తస్నీమ్, సఫియ్యా కలిసి అక్కడే ఓ స్కూల్‌కు వెళ్ళి చదువుకునేవారు, ఎల్‌కేజీలో. జీవితం యధావిధిగా సాగుతూ ఉంది.

1975వ సంవత్సరం, ఫిబ్రవరి 27న మౌలానా అబ్దుర్రజ్జాక్ లతీఫీ, ఆంధ్రప్రదేశ్ జమాఅత్ సభ్యుల్నీ, సానుభూతిపరుల్నీ దుఖంలో ముంచి పరమపదించారు. నేను కరీంనగర్ వెళ్ళి జనాజా నమాజ్‌లో పాల్గొన్నాను. ఆయన ఇంటికి దగ్గరలోని ఓ పెద్ద మైదానంలో జనాజా నమాజ్ జరిగింది. అసంఖ్యాక జమాఅత్ కార్యకర్తలు, సభ్యులు, సానుభూతిపరులు అందులో పాల్గొన్నారు.

తెలుగు పబ్లికేషన్స్ పుస్తకాలు ప్రముఖుల దృష్టిలో..

1975లో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. వాటిలో నేను ఎంతో ఆసక్తి మరెంతో ఉత్సాహంగా పాల్గొన్నాను. ఆ మహాసభలకు ముగింపు కార్యక్రమంగా హైదరాబాద్ "నుమాయిష్ మైదాన్"లో ప్రపంచ తెలుగు ప్రచురణాలయాల ఓ ఎగ్జిబిషన్ జరిగింది. అందులో జమాఅత్ తెలుగు పబ్లికేషన్స్ తరపున మేము అప్పటికి పబ్లిష్ అయిన కొన్ని పుస్తకాలతో ఓ స్టాల్ తీసుకుని పాల్గొన్నాము.

ఆ సందర్భంలో సినీ కవులు ఆత్రేయ, ఆరుద్ర, సముద్రాల తదితర రచయితలు, కవులు ఎగ్జిబిషన్‌లో వచ్చి మా స్టాల్‌ని కూడా సందర్శించారు. పుస్తకాలు పరిశీలనగా చూశారు. ఆ సందర్భంలో మా స్టాల్‌లోని విజిటర్స్ బుక్‌లో ఆరుద్ర గారు మెచ్చుకోలుగా కొన్ని పంక్తులు వ్రాశారు. అలాగే ఆత్రేయ గారు కూడా కొన్ని పంక్తులు వ్రాశారు. ఆ పంక్తుల క్రింద మిగతా రచయితలు మాత్రం సంతకాలు పెట్టారు. స్టాల్‌లో నాతోపాటు అటెండ్ అవుతున్న మిత్రులు, ఈ కవులు, రచయితలకు కానుకగా ఇచ్చిన పుస్తకాలు తీసుకుని, థాంక్స్ చెప్పి మరీ వెళ్ళారు.

అప్పుడు ప్రఖ్యాత కవులు సి. నారాయణ రెడ్డి, గుంటూరు శేషేంద్ర శర్మ ప్రభృతులు కూడా స్టాల్‌ని సందర్శించారు. గుంటూరు శేషేంద్ర శర్మ గారు వచ్చినప్పుడు నేను విజిటర్స్ బుక్ ముందుంచగా అందులో తన చిరునామా, ఫోన్ నెంబర్ మాత్రం వ్రాశారు. నేను తెలుగులో మాట్లాడటం చూసి "మీరు తెలుగు బాగా మాట్లాడుతున్నారు, మీది ఏ ప్రాంతం?" అని ప్రశ్నించారు. నేను చెప్పాను, మెచ్చుకోలుగా భుజం తట్టి వెళ్ళిపోయారు. ఈ పరిచయాన్ని పురస్కరించుకుని నేను ఒకసారి ఆయన్ని గ్యాన్ బాగ్ ప్యాలెస్‌లో కలుసుకున్నాను. మరోసారి గీటురాయి దశ వార్షికోత్సవం సందర్భంగా (1989లో) జరిగిన సభలో పాల్గొనేందుకు ఆహ్వానించడానికి నా తోటి సంపాదక సోదరులు, అజీజుర్రహ్మాన్, అబుల్ ఇర్ఫాన్ కూడా ఆయన్ని కలుసుకున్నారు.

ఎమర్జెన్సీ!

భారతదేశంలో 1975 జూన్‌లో ఎమర్జెన్సీ ప్రకటించడానికి మూల కారణం రాజకీయ అస్థిరత, దానితో పాటు నిరసన ప్రదర్శనలు, ప్రభుత్వ వ్యతిరేక ధోరణులు, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో సంపూర్ణ విప్లవం (Total Revolution), వాటికి తోడుగా ఆర్థిక సంక్షోభం, అన్నింటినీ మించి నిరుద్యోగ పరిస్థితులు ముఖ్యంగా 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ 1971 ఎన్నికల్లో వక్ర మార్గాలు అవలంబించారన్న ఆరోపణ రుజువయినట్లు ఆమె ఎన్నికనే రద్దు చేసింది. ఆ పైన ప్రభుత్వం, జాతీయ భద్రతకు ప్రమాదం మూడినట్లు కారణం చూపి ఎమర్జెన్సీని ప్రకటించింది.

ఈ తీర్పు వల్ల శ్రీమతి ఇందిరా గాంధీ ప్రధాని పదవి నుంచి వైతొలగాలన్న డిమాండు మరీ తీవ్రతరమయింది. సామాజిక అశాంతి, జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం ప్రభుత్వ ఉనికినే ప్రశ్నించాయి. ఇదంతా దేశంలో రాజకీయ అస్థిరతా వాతావరణాన్ని సృష్టించింది. ఇంకా పరిపాలనా రంగంలో అవినీతి సర్వ వ్యాప్తంగా ఆక్రమించుకోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి సర్వ సామాన్యమయిపోయింది. దేశంలో రాజకీయ సుస్థిరత, ప్రజల్లో క్రమశిక్షణ నెలకొల్పేందుకు తప్పదని ప్రభుత్వం, 1975 జూన్ 25న అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.

కాని శ్రీమతి ఇందిరా గాంధీ దేశంలో లోక్‌సభ సాధారణ ఎన్నికలు ప్రకటించారు.1977, మార్చి16 - 20 లో జరిగిన ఎన్నికల్లో ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ రాయ్‌బరేలీలో 55,202 ఓట్ల తేడాతో ఓడిపోయారు, అదీ రాజ నారాయణ్ వంటి రాజకీయాల్లో అనామకుని చేతిలో! కాంగ్రెస్ పార్టీ చిత్తు చిత్తుగా ఓడిపోయి, జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏకమయిన విపక్ష పార్టీలు పెద్ద ఎత్తున విజయం సాధించాయి. అలా ఎమర్జెన్సీని ఎత్తివేసేందుకు మార్గం సుగమమయింది. 1977, మార్చి 21న అర్థరాత్రి ఎమర్జెన్సీ ఎత్తివేసినట్లు ప్రకటించడం జరిగింది.

ఎమర్జెన్సీ - ప్రజల ఆగడాలు

ఎమర్జెన్సీని దేశంపైన రుద్దిన కాలంలో రాజ్యాంగాన్ని సస్పెండ్ చేయడమూ జరిగింది. ఎమర్జెన్సీతోపాటు కొన్ని సంస్థలపై ఆంక్షలు సయితం విధించబడ్డాయి. ఆ సంస్థల్లో జమాఅతె ఇస్లామీ హింద్ కూడా ఉంది. జమాఅత్ కార్యకలాపాలపై ఆంక్షలు విధించడంతోపాటు దేశమంతటా జమాఅత్ నాయకుల్ని, సభ్యుల్ని నిర్బంధంలోకి తీసుకోవడం జరిగింది.

జమాఅత్ కేంద్ర, రాష్ట్ర నాయకులు అందరూ అరెస్ట్ అయ్యారు. అప్పుడు మా ఇంటి యజమాని హాఫిజ్ గారు కూడా అరెస్ట్ అయ్యారు. అప్పుడు గ్రామాల్లో, నగరాల్లోని చిన్న పెద్ద జమాఅత్ నాయకులందరూ అరెస్ట్ అయ్యారు. అరెస్ట్ అయిన వారిలో మా బావ ముకర్రమ్ కూడా ఉన్నారు. అప్పుడు ఆయన బెల్లంపల్లి ప్రాంతానికి అమీర్. కాని ఆయన మందమర్రిలో, మా ఇంట ఉండేవారు. విషయం తెలుసుకున్న నేను వెంటనే మందమర్రికి

ప్రయాణం అయ్యాను. అక్కడ మా అమ్మ, చెల్లి, తెలియ పరిచారు, పోలీసు ఇన్‌స్పెక్టర్ నన్ను గురించి కూడా వాకబు చేశారని.

అందువల్ల జమాఅత్ కార్యకర్తలు పోలీసుల్ని తప్పించుకు తిరుగుతున్నారన్న అపవాదు రాకూడదు అని నేను స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఇన్‌స్పెక్టర్‌ని విచారించాను. ఆయన, తాను పై అధికారులకు, నేను ఇప్పుడు మందమర్రిలో లేనని, హైదరాబాద్‌లో ఉంటున్నానని తెలిపినట్లు చెప్పారు. ఇంకా, "మీరు ఇక్కడికి రానవసరం లేదు, వెళ్ళిపోండి" అన్నారు. నేను చెప్పాను, మా అమ్మ, చెల్లి ఇక్కడే ఉంటారు, అప్పుడప్పుడు రావలసి ఉంటుంది అని. దానికి ఆయన, "ఏం పర్వాలేదు, ఇక మీ పైన ఎటువంటి బాధ్యత లేదు, మీ ఇష్టం ప్రకారం తిరగవచ్చు" అన్నారు.

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

జమాఅత్ కార్యకలాపాలు ఆంక్షలకు గురి కావడం చేత హైదరాబాద్‌లో జమాఅత్ ఆఫీసుకు సీలు చేసే ముందు సోదా చేస్తూ వారు చూశారు, కొన్ని అకౌంటు రిజిస్టర్లతోపాటు తెలుగు పబ్లికేషన్స్‌కు సంబంధించిన పుస్తకాలు, నా అనువాద ప్రతులు తప్ప మరేమీ లేవు. అయితే ఏమని అనుకున్నారో ఏమో, నుమాయిష్ మైదానంలో మేము నిర్వహించిన స్టాల్‌లోని "విజిటర్స్ బుక్" మాత్రం తీసుకు వెళ్ళారు!

ఆ కాలంలో అరెస్టు కాని నేను, మరో జమాఅత్ సభ్యులు సయ్యద్ యూసుఫ్ భాయీ కలిసి తెలుగు పబ్లికేషన్స్ విభాగాన్ని, అలాగే సోషల్ సర్వీస్ సొసైటీని జమాఅత్ నుంచి వేరుగా సొసైటీస్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ చేయించాలని నిర్ణయించుకున్నాము. ఇద్దరం కలిసి దాని నియమ నిబంధనలు తయారు చేశాము. దానికి "తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్" అని నామకరణం కూడా చేశాము. ఆ పైన రిజిస్ట్రేషన్ పని కూడా ముగిసింది. నన్ను ఆ సొసైటీకి సెక్రటరీగా ఎన్నుకోవడం జరిగింది. ఈ విధంగా ఈ రెండు సంస్థలు (ఇస్లామిక్ సోషల్ సర్వీస్ సొసైటీ, తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్) జమాఅత్‌తో ఎటువంటి సంస్థాగత, చట్ట పరమయిన సంబంధం లేకుండా స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించ సాగాయి.

(ఇంకా వుంది)

దేశవ్యాప్తంగా 'పొరుగువారి హక్కుల ఉద్యమం':
జమాఅతె ఇస్లామీ హింద్ పిలుపు

ఆధునిక యుగంలో విజ్ఞానం, సాంకేతికత అతి వేగంగా ముందుకు సాగుతున్నా, మనిషి హృదయాన్ని కమ్మేస్తున్న స్వార్థపరత్వం మాత్రం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. సమాజంలో మాయమవుతున్న మానవత్వంపై విచారం వ్యక్తం చేస్తూ జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర ప్రతినిధి మండలి సభ్యులు మౌలానా ఇమ్దాదుల్లా హుసైని నిజామీ సమాజంలో పెరుగుతున్న ఒంటరితనాన్ని ఆవేదనతో చర్చించారు. కడప బెల్లంమండి వీధిలోని మదరస-ఎ-జెహ్రా సమావేశ హాల్లో విలేకరులతో మాట్లాడిన ఆయన, "జ్ఞాన విస్ఫోటన యుగంలో మనిషి ఎన్నో శిఖరాలు అధిరోహించాడు. కానీ, తన పక్కింటివారిని పలకరించే సమయం కూడా కేటాయించని స్థాయికి దిగజారాడు" అని వ్యాఖ్యానించారు.

ఈ నేపథ్యంలో, సమాజంలో జరుగుతున్న మార్పులను విశ్లేషిస్తూ జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి జనాబ్ షాకిర్ హుసేన్ మాట్లాడుతూ "నేటి మనిషి సామాజిక బాధ్యతల్ని విస్మరించి స్వలాభం చుట్టూ తిరుగుతున్నాడు. సమాజాన్ని దూరం చేస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో పొరుగువారితో మెలగడం, వారి హక్కులను గుర్తించడం అనివార్యం" అన్నారు. ఈ అవగాహనను సమాజంలో బలంగా నిలిపేందుకు దేశవ్యాప్తంగా నవంబర్ 21 నుంచి 30 వరకు "పొరుగువారి హక్కుల ఉద్యమం"ను ప్రారంభించినట్టు ఆయన వెల్లడించారు.

కడప శాఖ అధ్యక్షులు జనాబ్ జాకీర్ హుసేన్ మాట్లాడుతూ, ఇస్లాం ధర్మం పొరుగువారితో మంచిగా ప్రవర్తించడం విశ్వాసంలో భాగమని స్పష్టంగా చెబుతుందని గుర్తు చేశారు. "ఎవరి చేతల వల్ల పొరుగువారు రక్షణ లేకుండా ఉంటారో, అలాంటి వ్యక్తి నిజమైన ముస్లింగా పరిగణించబడడని ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన బోధనను ఆయన గుర్తుచేశారు. ఈ ఉద్యమంలో 'పొరుగువారు' అనే పదానికి విస్తృత అర్థాన్ని వివరిస్తూ, "కేవలం ఇంటి పక్కనున్న వారు మాత్రమే కాదు, మనతో ప్రయాణించే వారు, ట్రాఫిక్‌లో భాగస్వాములు, ఆన్‌లైన్‌లో కలిసే వర్చువల్ సహచరులు, దేవాలయంలో, మసీదులో, చర్చి లేదా ఏ ఉపాసన స్థలంలో కలిసే వారు అందరూ పొరుగువారే" అని చెప్పారు.

రిపోర్టు : మీడియా ఇన్‌చార్జ్, జమాఅతె ఇస్లామీ హింద్, కడప.

ప్రస్తుత సమాజంలో మనిషి నిరంతరం అన్వేషిస్తున్నది సుఖం, సంతోషం, ప్రశాంతత కోసమే. ఈ గమ్యం కోసం అతను దొరికిన మార్గాలన్నింటినీ అవలంబిస్తున్నాడు. లెక్కలేనంత డబ్బును ఖర్చు చేస్తున్నాడు, అమూల్యమైన సమయాన్ని వెచ్చిస్తున్నాడు. అయినా, ఆశించిన ఫలితం మాత్రం అతనికి దక్కడం లేదు.

కోల్పోయిన వస్తువును ఎక్కడో వెతకడం మానేసి, పోయిన చోటనే వెతకాలి అన్నట్టుగా, మనిషి తనలోని శాంతిని, సంతోషాన్ని తనలోనే వెతుక్కోవాలి. హృదయాన్ని బంధించే దుఃఖపు సంకెళ్లను, ప్రశాంతతకు అడ్డుపడే అడ్డంకులను గుర్తించాలి. ఆత్మపరిశోధన చేసి, వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే నిజమైన సుఖసంతోషాలు అతని సొంతమవుతాయి, అనంతమైన ప్రశాంతత అతని మనసును ఆవహిస్తుంది.

ఈ ఆనందపు బాటలో మనిషి గుర్తించాల్సిన, ఆచరించాల్సిన శక్తివంతమైన అంశాలు ఇక్కడ పొందుపరచబడ్డాయి:

శాశ్వతానందం కోసం ఆత్మ నిశ్చలత

◆ అల్లాహ్‌ను విశ్వసించండి : అల్లాహ్‌ను సంపూర్ణంగా విశ్వసించండి. సకలం ఆయన అధీనంలోనే ఉందనే అచంచలమైన విశ్వాసాన్ని కలిగి ఉండండి.

◆ నిరంతర స్మరణ : ఎల్లప్పుడూ అల్లాహ్ నామాన్ని స్మరిస్తూ ఉండండి. దరూద్‌ను పఠిస్తూ ఉండండి.

◆ ఆరాధనలో నిబద్ధత : ఫర్జ్ నమాజ్‌లతోపాటు, నఫిల్ నమాజులను ఆచరించే ప్రయత్నం చేయండి. మీ ఆత్మకు విశ్రాంతినివ్వండి.

◆ ఖుర్‌ఆన్ అధ్యయనం : ప్రతిరోజూ ఖుర్‌ఆన్ గ్రంథాన్ని అర్థం చేసుకుంటూ పఠించండి. అది మీ జీవితానికి దిశానిర్దేశం చేస్తుంది.

◆ గతాన్ని వదిలివేయండి : జరిగిపోయిన దాని గురించి దిగులు చెందడం తక్షణం మానివేయండి. గతం కేవలం ఒక పాఠం మాత్రమే, బంధనం కాదు.

◆ కృతజ్ఞత: మీకు ప్రసాదించబడిన ప్రతిదానిపట్లా కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండండి. ఉన్నదాని విలువ తెలుసుకోండి.

◆ ఉదయం అయినప్పుడు సాయంత్రం కోసం నిరీక్షించకండి. ఈ లభించిన క్షణాన్ని, సమయాన్ని సద్వినియోగం చేసుకోండి.

◆ రేపటి చింత వద్దు: రాబోయే రేపటి గురించి అతిగా ఆలోచించకండి. ఒక్క క్షణం తరువాత ఏమవుతుందో ఎవరికీ తెలియని సత్యం.

మానసిక ప్రశాంతతకు రక్షణ కవచం

◆ ఈర్ష్యను దహించండి : ఈర్ష్య, అసూయలకు దూరంగా ఉండండి. అవి మీ మనసులో అగ్నిని రాజేస్తాయి; సత్కార్యాలను కాల్చేస్తాయి.

◆ సద్భావం పెంపొందించండి : ప్రజలతో మర్యాదగా,

సద్భావంతో కలవండి. అనవసరమైన, నిష్ప్రయోజనమైన సమావేశాలకు దూరంగా ఉండండి.

◆ కుటుంబానికి ప్రాధాన్యత: ఎక్కువగా మీ ఇంటివారితో, ప్రియమైనవారితో గడపండి. వీధుల్లో కూర్చుని పిచ్చాపాటి కబుర్లతో సమయాన్ని వృథా చేయకండి.

◆ పుస్తకాలతో స్నేహం: ఖాళీ సమయాన్ని పుస్తకంతో గడపండి. పుస్తకం మీకు ఉత్తమ స్నేహితునిగా ఉంటుంది, విజ్ఞానాన్నిస్తుంది.

◆ సృష్టిపై దృష్టి: మనసులో అనవసరమైన ఆలోచనలు తలెత్తుతూ ఉంటే, వాటిని సృష్టి వైపునకు, విశ్వ రహస్యాల వైపునకు మరల్చండి.

జీవితాన్ని శక్తివంతంగా మార్చుకోండి

◆ సాహిత్యం, చరిత్ర : మంచి కథలు చదవండి. చరిత్రను తెలుసుకునే ప్రయత్నం చేయండి. ఇది మీకు దిశానిర్దేశనం చేస్తుంది.

◆ జీవన వైవిధ్యం: మార్పు కోసం ప్రతిరోజూ ఒకేవిధంగా గడపకుండా, మీ దినచర్యలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటూ ఉండండి. నిత్య నూతనంగా ఉండండి.

◆ తృప్తిగా జీవించండి: ఉన్నదాంట్లోనే మంచిగా తినండి. మంచి వస్త్రాలను ధరించండి. తృప్తే నిజమైన సంపద.

◆ క్షమించడం నేర్చుకోండి: మీపై దౌర్జన్యం చేసిన వ్యక్తిని కూడా క్షమించి వేయండి. తెగదెంపులు ఎవరైనా మీతో చేసి ఉంటే, ముందడుగు వేసి వారితో స్నేహం చేయండి.

లోక జ్ఞానం, ఆత్మవిశ్వాసం

◆ సంపదలో కిందివారిని చూడండి : ప్రాపంచిక విషయాలలో, భౌతిక సుఖాల విషయంలో మీకన్నా లేనివాళ్ళను చూడండి. మీకున్న దానికి కృతజ్ఞత చెల్లించండి.

◆ జ్ఞానంలో ఉన్నతులను చూడండి: విద్యాజ్ఞానాల విషయంలో ఉన్నతులను చూడండి. వారితో ఆరోగ్యకరమైన పోటీపడండి, ఉన్నత శిఖరాలను అధిరోహించండి.

◆ సంతోష స్మరణ: గడిచిపోయిన సంతోష సందర్భాలను జ్ఞాపకం చేసుకుంటూ ఉండండి. దుఃఖ సంఘటనలను మరిచిపోండి.

◆ ఆత్మ ధైర్యం: అల్లాహ్‌పై పూర్తిగా నమ్మకముంచండి. ఆ తరువాత మిమ్మల్ని మీరు కూడా నమ్ముకోండి. ఈ నమ్మకం మీకు ధైర్యాన్ని ప్రసాదిస్తుంది, ముందుకు నడిపిస్తుంది.

సంతోషానికి సజీవ అలవాట్లు

◆ స్వయంకృషి: ప్రతి పనిని స్వయంగా చేసుకునే అలవాటును సజీవంగా ఉంచండి. ఇతరులపై అతిగా ఆధారపడకండి. ఆధారపడటం ద్వారానే మనస్పర్థలు చోటుచేసుకుంటాయి.

◆ నవ్వును స్థిరపరచండి : ఎల్లప్పుడూ పెదవులపై చిరునవ్వును స్థిరపరచండి. ముఖంలో చిరాకును ఏ మాత్రం ప్రదర్శించకండి.

◆ బాధలను సృష్టికర్తకే: కష్టాలను, బాధలను సర్వ బాధల నుంచి విముక్తిని ప్రసాదించే సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్‌కు మాత్రమే వినిపించండి. ఆయన ముందే విలపించండి.

◆ ప్రజల ముందు వద్దు: ప్రజల ముందు మీ బాధలు చెప్పుకోవడం, వారి ముందు విలపించడం ఎంత మాత్రమూ చేయకండి. ఇది మీ గౌరవాన్ని తగ్గిస్తుంది.

◆ కృషి, దైవ సహాయం: కష్టపడండి, కృషి చేయండి. ఆ తరువాత దైవ సహాయం మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి చేరుతుంది.

ఆత్మ సంతృప్తి, బాధ్యత

◆ శక్తిని కాపాడుకోండి: శరీరంపై ఎక్కువ భారాన్ని వేయకండి, మరీ అలసత్వానికి గురి చేయకండి. ప్రతిరోజూ చురుకుగా ఉండే ప్రయత్నం చేయండి.

◆ ఒంటరితనం వద్దు: ఒంటరిగా ఉండకండి. ఒంటరితనం మనిషిని కబళిస్తుంది. ఒంటరితనంలో పుస్తకాలతో స్నేహం చేసుకోండి.

◆ నిరంతర కార్యాచరణ: ఖాళీగా ఉండకండి. ఖాళీ సమయం మనిషి ప్రతిభా పాటవాలను హరించివేస్తుంది. అనునిత్యం నచ్చిన పనులలో ఏదో ఒకటి చేస్తూ ఉండండి.

◆ సహాయంలో శక్తి: ప్రజలకు తోడ్పడుతూ ఉండండి. ఈ అలవాటు మనిషి శరీరానికి, మనసుకు శక్తిని ప్రసాదిస్తూ ఉంటుంది.

◆ మిత్రులను లెక్కించండి: మిత్రులను లెక్క వేసుకోండి. శత్రువులను లెక్క పెట్టకండి. మితంగా పరిహాసమాడండి. మనసు తేలికవుతుంది.

◆ జ్ఞానదానం: మీకు వచ్చిన విద్యను ప్రజలకు పంచండి. వారిలో మిమ్మల్ని మీరు చూసుకుంటారు.

◆ సలహాలలో తృప్తి: ప్రజలకు మంచి సలహాలు ఇవ్వండి. దాని ద్వారా మీ మనస్సు తృప్తిని సంతరించుకుంటుంది.

◆ నిజాయితీ: మనసులో ఒకటి, పెదవులపై ఒకటి ఉంచకండి. దీని ద్వారా మనసు కలవరపడుతూ ఉంటుంది.

◆ అల్లాహ్‌కు మాత్రమే భయం: ఎవ్వరితోనూ భయపడకండి. కేవలం అల్లాహ్‌కే భయపడండి.

◆ బాధ్యత: మీకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా, చిత్తశుద్ధితో నిర్వహించండి.

◆ ఆశావహ దృక్పథం: అనారోగ్యానికి గురైనప్పుడు, ఆరోగ్యం తప్పకుండా లభిస్తుందనే అచంచలమైన ఆశను ఉంచండి.

ఆరోగ్యమే మహాభాగ్యం... ఈ మాట మన పెద్దలు తరచూ చెప్పే సత్యం. మన జీవితంలో అత్యంత విలువైనది ఏది అని ప్రశ్నిస్తే, వెంటనే సంపదనో, హోదానో అనుకుంటాం. కానీ, ఆరోగ్యం లేనిదే ఆ సంపద, ఆ హోదా వ్యర్థమని మన అనుభవం నిరూపిస్తుంది. నిజానికి, ఆరోగ్యం అనేది మనకు అల్లాహ్ ప్రసాదించిన అత్యంత గొప్ప, అమూల్యమైన వరం.

నిర్లక్ష్యం చేయకూడని రెండు వరాలు

దైవప్రవక్త ముహమ్మద్ (స) ఒక అద్భుతమైన సత్యాన్ని మానవాళికి గుర్తు చేశారు: "రెండు వరాల విషయంలో మానవులు చాలా నిర్లక్ష్యం వహిస్తారు. 1. మంచి ఆరోగ్యం 2. తీరిక."

మనం డబ్బు సంపాదించడానికి, పనులు పూర్తి చేయడానికి పరుగు పెడుతూ, మన దేహాన్ని, మన సమయాన్ని అలక్ష్యం చేస్తాం. అల్లాహ్ దృష్టిలో, బలహీన విశ్వాసికంటే బలమైన విశ్వాసి చాలా ఇష్టం. ఇక్కడ బలం అంటే కేవలం దైహిక బలం కాదు, దైవారాధనకు, సత్కార్యాలకు తోడ్పడే సంపూర్ణ ఆరోగ్యం.

హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) చెప్పిన ఈ మాటలు మన జీవితాలకు మార్గదర్శకం: "ఎవరికైతే ఈ నాలుగు వరాలు లభించాయో, వారికి ప్రపంచంలోని వరాలన్నీ లభించినట్లే: 1. కృతజ్ఞతలు తెలిపే నాలుక, 2. స్మరించే హృదయం, 3. కష్టపడే శరీరం, 4. గుణవంతురాలైన భార్య." ఇందులో కష్టపడే శరీరం అంటే ఆరోగ్యంగా, చురుకుగా ఉండే దేహం. ఎందుకంటే, ఆరోగ్యంగా ఉంటేనే మనం మనసు పూర్తిగా, శ్రద్ధగా అల్లాహ్‌ను ఆరాధించగలం, ఇతరులకు సహాయపడగలం, సృష్టికర్తను మరియు సృష్టితాలను సంతృప్తిపరచగలం.

ఆహార నియంత్రణ: ఆధ్యాత్మిక శక్తికి కీలకం

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడానికి ప్రధాన కారణాలలో ఒకటి - ఆహారపు అలవాట్లు. హదీసుల్లో అతిగా తినడాన్ని తీవ్రంగా వారించడం జరిగింది. ప్రవక్త (స) తన జీవితకాలంలో ఏ రోజూ రెండు పూటలా కడుపు నిండా తినలేదని హజ్రత్ ఆయిషా (రజి) పేర్కొన్నారు.

మరో హదీసులో ఎంత గొప్ప హెచ్చరిక ఉందో చూడండి: "ప్రజలు తమ కడుపులు నింపుకుంటే వారి శరీరాలు బలహీన పడిపోతాయి, హృదయాలు కఠినమవుతాయి, కోరికలు పెచ్చరిల్లుతాయి." ముహమ్మద్ బిన్ వాసె వంటి పెద్దలు, "ఎవరైతే తక్కువగా తింటారో, వారు విషయాన్ని ఎక్కువగా అర్థం చేసుకోగలరు, ఇతరులకు వివరించనూ గలరు," అని తెలిపారు. కడుపు నిండా తినకపోవడం అనేది కేవలం దేహానికి మాత్రమే కాదు, మన హృదయానికి, మేధస్సుకు కూడా పదును పెట్టే సాధనం. అమర్ బిన్ ఖైస్ చెప్పినట్లు: "మీరు కడుపునిండా తినకండి, దానివల్ల హృదయం కఠినమవుతుంది."

ఆరోగ్యం ఒక విధంగా మనకు లభించిన అమానతు (నమ్మకంతో అప్పగించబడిన వస్తువు). దానిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. కనుక, పోషకాలున్న ఆహారాన్నే తీసుకుందాం. సమయపాలన పాటిద్దాం. నేటి ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి,

జంక్ ఫుడ్స్, శీతల పానీయాల ఉచ్చులో పడకుండా, ఇంటి ఆహారానికి, కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్‌కు ప్రాధాన్యత ఇద్దాం.

సత్కార్యాలకు సోపానం: వ్యాయామం

ఆహారపు అలవాట్లతో పాటు మనం నిర్లక్ష్యం చేస్తున్న మరో అంశం వ్యాయామం. నడక, చిన్నపాటి వ్యాయామం దేహాన్ని చురుకుగా, మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. వ్యాయామాన్ని మనం భోజనం చేసినంత తప్పనిసరిగా జీవితంలో భాగంగా చేసుకోవాలి.

మనిషి ఆరోగ్యంగా ఉంటే...

- అన్ని పనులూ స్వయంగా చేసుకోగలడు.
- మంచిగా నమాజ్ చేస్తాడు, ఉపవాసాలుంటాడు, దానధర్మాలు చేస్తాడు.
- హజ్, తహజ్జుద్ నమాజ్ వంటి గొప్ప ఆరాధనలు చేయగలడు.
- ఖుర్ఆన్ పారాయణం, జిక్ర్ వంటి వాటిని ఏకాగ్రతతో చేయగలడు.
- ఇతరుల అవసరాలు తీర్చడానికి, పనుల్లో సహాయపడడానికి శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటాడు.

అనారోగ్యానికి గురైతే... నిస్సత్తువ, బలహీనత ఆవహించి, సొంత పనులకు కూడా ఇతరుల సహాయం తీసుకోవాల్సి వస్తుంది. చివరికి, నమాజ్ కూడా సరిగ్గా చేయలేడు, ఉపవాసం ఉండలేడు, సత్కార్యాల నుండి దూరమవుతాడు.

అనారోగ్యానికి ముందు ఆరోగ్యాన్ని భాగ్యంగా భావించండి అన్న ప్రవక్త (స) ఉపదేశాన్ని అనుసరిద్దాం. చేతులారా ఆరోగ్యాన్ని పాడు చేసుకోకుండా, రేపటి పశ్చాత్తాపం కోసం వేచి చూడకుండా, ఈ క్షణం నుంచే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుదాం.

ఆరోగ్యం అనేది అల్లాహ్ మనకు ఇచ్చిన సామర్థ్యం. ఈ సామర్థ్యాన్ని దైవారాధనలో, సృష్టికి సేవ చేయడంలో విని యోగించి, సృష్టికర్త సంతృప్తిని పొందుదాం.

గుసగుసలాడే ఆకుపచ్చని లోకం

ఆదివారం సాయంత్రం వేళ, పశ్చిమ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిశ్శబ్దం అలుముకుంది. కానీ, అక్కడి ప్రయోగశాలల్లో మాత్రం కొందరు శాస్త్రవేత్తల మనసులు ఒక అంతుచిక్కని రహస్యం వెంట పరుగులు తీస్తున్నాయి. అదేమిటంటే... మొక్కలు!

డాక్టర్ ఆలిస్, తన హెడ్‌సెట్‌ను సర్దుకుంటూ, ఈ అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. “మొక్కలు నిశ్శబ్దంగా ఉంటాయి అనేది మన భ్రమ కావచ్చు. వాటికి నిజంగానే ఒక భాష ఉంటే? అవి మన మాటలకు, మన సంగీతానికి స్పందిస్తే?” అని ఆమె ఆలోచించేది.

వారి ప్రయత్నాలు ఫలించాయి! 2012లో ‘జర్నల్ ఆఫ్ ట్రెండ్స్ ఇన్ బొటానికల్ సైన్సెస్’ పత్రికలో ప్రకటితమైన ఒక సంచలనాత్మక విషయం ఏమిటంటే... అసాధ్యం అనుకున్నది సాధ్యమైంది.

అత్యంత సున్నితమైన పరికరాలను ఉపయోగించి రికార్డు చేసినప్పుడు, వారికి ఒక విషయం స్పష్టమైంది. ఆకుపచ్చని ప్రపంచం గుసగుసలాడుతోంది! మన చెవులకు చేరని, అతి తక్కువ ధ్వని తరంగాల ద్వారా ఒక మొక్క పక్కనున్న మరో మొక్కతో ‘మాట్లాడుకుంటోంది’. ఆహారం గురించి, ప్రమాదం గురించి, లేదా కేవలం తమ ఉనికి గురించి అవి నిరంతరం సమాచారాన్ని పంచుకుంటున్నాయి.

“ఇది కేవలం సంభాషణ మాత్రమే కాదు!” అని డాక్టర్ ఆలిస్ ఉద్వేగంగా అంది. “మొక్కలు మనలాగే శబ్దాలచే ప్రభావిత మవుతున్నాయి. వాటి పెరుగుదలలో, వాటి జీవన చక్రంలో ఈ ధ్వని ఒక ఊపిరిలాంటిది. ఈ శబ్దాలకు ప్రతిస్పందిస్తూ, అవి తమ జీవితాన్ని తీర్చిదిద్దుకుంటున్నాయి.”

ఈ పరిశోధన ఒక కొత్త తలుపును తెరిచింది. ప్రపంచమంతా మూగగా, నిశ్శబ్దంగా ఉందని మనం అనుకున్న ప్రతిచోటా... ఓ నిరంతర సంభాషణ, ఓ జీవన సంగీతం సాగుతోందని తేలింది. మొక్కలు కూడా తమదైన భాషలో మాట్లాడుతున్నాయని, వాటికి కూడా ఓ ‘ఆత్మీయ చైతన్యం’ ఉందని ఈ అద్భుత ఆవిష్కరణ నిరూపించింది.

మొక్కలు మాట్లాడుతున్నాయని, శబ్దాలకు స్పందిస్తున్నాయని తెలిశాక... అవి తమ సృష్టికర్తను కీర్తించడం కూడా వింతగా అనిపించదు కదా?

ఆ దివ్య సత్యాన్నే అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇలా ప్రకటించాడు: **“ఆయన పరిశుద్ధతను సప్తాకాశాలూ, భూమీ, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ కొనియాడుతున్నాయి. ఆయన స్తోత్రంతో పాటు ఆయన పరిశుద్ధతను కొనియాడనటు వంటిది ఏదీ లేదు. కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు.!” (దివ్య ఖుర్ఆన్: 17: 44)**

అవును, ఈ సృష్టిలోని ప్రతి పువ్వు, ప్రతి ఆకు, ప్రతి ధూళి కణం... అన్నీ కలిసి ఒకే సృష్టికర్త కీర్తిని పాడుతున్న గొప్ప సంగీతంలో భాగమే! మనకు వినబడని ఆ ‘ఆకుపచ్చని పాట’ సృష్టి రహస్యాన్ని మనకు వెల్లడిస్తోంది.

- షేక్ అబ్దుల్ బాసిత్. కొత్త గూడెం

ప్రవక్త ముహమ్మద్ (స) స్పష్టంగా సెలవిచ్చారు: అల్లాహ్, ఆయన ప్రవక్త మిమ్మల్ని ప్రేమించాలంటే, మీలో మూడు కీలక గుణాలు ఉండాలి.

1. సత్యమే పలకాలి, అబద్ధాన్ని విసర్జించాలి!

మాట్లాడటం దేవుడు మనకిచ్చిన గొప్ప వరం. భావ వ్యక్తీకరణకు, ఇతరుల ఉద్దేశాలను అర్థం చేసుకోవడానికి, మానవ సంబంధాలను మెరుగు పరుచుకోవడానికి మాట ఒక అద్భుతమైన సాధనం. ప్రవక్త(స) ఒక సందర్భంలో "పరిహాసానికి కూడా అబద్ధం ఆడరాదు" అని గట్టిగా హెచ్చరించారు.

అబద్ధం ఏ విధంగా చూసినా అపాయకరమే. అది మనసుల్లో అనుమానాన్ని, అపనమ్మకాన్ని పెంచుతుంది. తద్వారా మనుషుల మధ్య విశ్వాసం సన్నగిల్లుతుంది. అందుకే, రమజాన్ ఉపవాసాల సందర్భంగా ప్రవక్త (స) చేసిన హెచ్చరిక చాలా కీలకం: "ఎవరైతే అబద్ధాలు ఆడటం, వాటిని ఆచరించడం మానరో, వారు ఉపవాసం ఉండటం వలన ప్రయోజనం లేదు." అంటే, అబద్ధాన్ని విడనాడకుండా చేసే నమాజ్, హజ్, జకాత్ వంటి పుణ్యకార్యాలు కూడా అంగీకరించబడవు అని గ్రహించాలి.

2. అప్పగించిన అమానత్‌ను కాపాడాలి!

ఎవరైనా మిమ్మల్ని నమ్మి ఏదైనా వస్తువును లేదా బాధ్యతను అమానత్‌గా (నమ్మకంతో అప్పగిస్తే) దానిని అత్యంత భద్రంగా కాపాడి, తిరిగి అప్పగించాలి. ఇతరుల నమ్మకాన్ని నిలబెట్టడం అనేది విశ్వాసికి అత్యంత ముఖ్యమైన లక్షణం.

3. పొరుగువారి పట్ల మంచితనం!

భక్తి అంటే కేవలం నమాజ్, రోజా, హజ్, జకాత్ అని భ్రమ పడకండి. ఇస్లాం అసలైన సౌందర్యం మన వ్యవహారంలో, నడవడికలో ఉంది. దీనికి ఉదాహరణగా ప్రవక్త (స) చెప్పిన రెండు ఘటనలు మన కళ్లు తెరిపించాలి:

ఒక స్త్రీ విధిగా చేయవలసిన నమాజ్, రోజా, హజ్, జకాత్‌లతో పాటు అదనపు దానధర్మాలు చేసినా, ఆమె గయ్యాళి స్వభావం కలది, ఆమె నోటి మాటకు అందరూ భయపడ తారు. అలాంటి స్త్రీ నరకవాసి అని ప్రవక్త (స) తీర్పునిచ్చారు.

మరొక స్త్రీ విధిగా చేయవలసిన పనులు చేస్తూ, అందరితో మంచిగా వ్యవహరిస్తూ, ఎవరినీ తన మాటలతో, చేతులతో బాధ పెట్టదు. ఆమె స్వర్గవాసి అని ప్రవక్త (స) ప్రకటించారు.

దీని అర్థం స్పష్టం: దైవారాధనల కంటే, సాటి మనిషితో మనం వ్యవహరించే తీరు మనకు స్వర్గ-నరకాలను నిర్ణయిస్తుంది.

పొరుగు ధర్మంపై ప్రవక్త వారి కఠిన సందేశం!

ప్రవక్త ముహమ్మద్ (స) పొరుగువారి హక్కుల గురించి చేసిన హెచ్చరికలు ప్రతి విశ్వాసిని కదిలించాలి:

"మీ పొరుగువారు పస్తులుండగా, మీరు కడుపు నిండా తిని నిద్రపోతే, మీరు విశ్వాసులే కారు!"

మీ ఇరుగు పొరుగు కష్టాల్లో, ఆకలితో, అనారోగ్యంతో అలమటిస్తుంటే, మీరు మాత్రం మీ కుటుంబంతో హాయిగా, సంతోషంగా జీవిస్తున్నారంటే, అది అల్లాహ్ పట్ల మీకు విశ్వాసం లేనట్లే! ఈ రోజు నమాజ్, రోజా, హజ్‌లు చేస్తూ, "గొప్ప భక్తిపరులం" అని అనుకునేవారు తప్పకుండా ఆలోచించవలసిన అవసరం ఉంది.

మనం చేసే చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చు. ఇతరులకు బాధ కలిగించే విధంగా రోడ్లపై బండ్లను పార్కింగ్ చేయడం, చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయడం, శుభకార్యాల సమయంలో పెద్ద శబ్దాలతో ముసలివారిని, చిన్నపిల్లలను ఇబ్బంది పెట్టడం... ఇవన్నీ కూడా పొరుగు ధర్మాన్ని ఉల్లంఘించడమే.

"తన చేష్టల వల్ల ఏ పొరుగువారికైతే కష్టం, నష్టం కలుగుతుందో, వారిలో దైవం పట్ల విశ్వాసం లేనట్లే."

మానవ సేవయే మాధవ సేవ

పొరుగువారితో చిన్న మనస్పర్థలు తలెత్తితే, అహంకారానికి పోకుండా, పెద్ద మనసుతో క్షమించండి అని వేడుకొని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. వారు కష్టాల్లో ఉన్నా, అనారోగ్యంతో ఉన్నా, వారికి సాధ్యమైనంత సహాయం చేయాలి.

ప్రళయ దినాన అల్లాహ్ అడిగే ప్రశ్న: "నేను అనారోగ్యంతో ఉంటే, నన్ను పరామర్శించడానికి ఎందుకు రాలేదు?" అని. అప్పుడు మనం "ప్రభూ! నీవు అనారోగ్యానికి గురి కావడం ఏమిటి?" అని అడిగితే, అల్లాహ్ ఇలా సమాధానమిస్తాడు: "ఫలానా నా దాసుడు అనారోగ్యంతో బాధపడుతుంటే, నీవు అతనిని పరామర్శించి ఉంటే, ఈ రోజు నన్ను పరామర్శించిన పుణ్యం నీకు దక్కేది."

మిత్రులారా!. దైవం మనకు ఏదైనా ఇచ్చి ఉంటే, అది మనపై ప్రేమతో కాదు, మనల్ని పరీక్షించడానికి అని గుర్తించాలి. దైవం మన ద్వారా తన దాసుల అవసరాలు తీర్చే ఏర్పాటు చేసి, మనం పుణ్యాలు సంపాదించుకునేలా చేశాడు.

గుర్తుంచుకోండి: వట్టి చేతులతో వస్తాం. తిరిగి వట్టి చేతులతో వెళ్ళిపోతాం. ఇక్కడ మనం సంపాదించిన హోదా, ఆస్తులు, జ్ఞానం... వీటన్నింటినీ దైవం చూపిన మార్గంలో, సాటి వారి కోసం ఉపయోగించి, మరణానంతరం శాశ్వత జీవితం స్వర్గమయం చేసుకోవాలి. అప్పుడే ఈ మానవ జీవితం సార్థకమవుతుంది.

చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015

Geeturai Weekly
Account No:1042789768
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
IFSC Code. CBIN0282407
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar
Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

38 ఆయత్‌లు

47. ముహమ్మద్

మదీనా అవతరణ

4 .... కాగా ఈ తిరస్కారుల్ని మీరు మార్కొన్నప్పుడు మీరు చేయవలసిన తొలి పని మెడలు నరకడం, అలా కడకు మీరు వారిని బాగా అణచివేసిన తరువాత ఖైదీలను గట్టిగా బంధించండి. ఆ తరువాత (మీకు అధికారముంది) ఉపకారం చేసినా, పరిహార వ్యవహారం చేసినా, యుద్ధం (ముగిసి) దాని అస్త్రశస్త్రాలు పడవేయబడేవరకు.[8]

(8వ పాదసూచిక గత సంచిక తరువాయి)

ప్రవక్త మహనీయుల(స) కాలం తరువాత ప్రవక్త సహచరుల కాలంలోనూ ఖైదీలను సద్భావనా రూపంలో విడుదల చేసిన దృష్టాంతాలు కానవస్తాయి. హజ్రత్ అబూబక్ర్ (ర), అష్అస్ బిన్ ఖైస్ కిన్దీని విడుదల చేశారు. హజ్రత్ ఉమర్(ర) హుర్ము జాన్‌ని, మనాజిర్, మీసాన్ ఖైదీలకు స్వేచ్ఛను ప్రసాదించారు *(కితాబుల్ అమ్వాల్ : అబీ ఉబైద్).*

(9) ధన పరిహారం తీసుకుని ఖైదీలను విడుదల చేసే దృష్టాంతం ప్రవక్త మహనీయుల (స) కాలంలో కేవలం బద్ర్ యుద్ధ సందర్భంలో మటుకే కానవస్తుంది. అప్పుడు ఒక్కొక్క ఖైదీని ఒక్క వెయ్యి నుండి నాలుగు వేల వరకు రొక్కం తీసుకుని విడుదల చేయడం జరిగింది. *(తబ్‌కాత్ ఇబ్ను సఅద్, కితాబుల్ అమ్వాల్).* ప్రవక్త సహచరుల కాలంలో ఇలాంటి దృష్టాంతమేదీ గోచరిం చదు. ఇస్లామీయ ధర్మవేత్తలు సర్వ సాధారణంగా దీన్ని ఇష్ట పడలేదు. ఎందువల్లనంటే, దీన్నిబట్టి డబ్బు తీసుకుని శత్రువును వదలిపెట్టడం జరుగుతుంది, అతడు తిరిగి దాడి చేసే ఆస్కార ముంటుంది. కాని దివ్యఖుర్ఆన్‌లో పరిహారం తీసుకునే అనుమతి ఇవ్వబడింది గనక, ప్రవక్త మహనీయులు ఒకసారి దాన్ని అమలు జరిపారు కూడా, కాబట్టి ఇలా చేయడం సమూ లంగా నిషిద్ధం కాదు. ఇమామ్ ముహమ్మద్ అస్సియరల్ కబీర్‌లో వ్రాసిన దాన్నిబట్టి ముస్లిములకు ఇలాంటి అవసరం ఏర్పడితే వారు ధనపరిహారం తీసుకుని ఖైదీలను వదలిపెట్టగలరు.

(10) ఏదయినా సేవ చేయించుకుని వదలిపెట్టే దృష్టాంతం కూడా బద్ర్ యుద్ధ సందర్భంలోనే ప్రాప్తమవుతుంది. ఖురైషీ ఖైదీలలో ఎవరయితే ధన పరిహారం ఇచ్చే స్థితిలో లేరో వారు విడుదల పొందడానికి ప్రవక్తశ్రీ(స) విధించిన షరతు, వారు అన్సారుల పదేసి బాలలకు చదవను, వ్రాయను నేర్పాలన్నది *(ముస్నద్ అహ్మద్, తబ్‌కాత్ ఇబ్ను సఅద్, కితాబుల్ అమ్వాల్).*

(11) ఖైదీల మార్పిడికి సంబంధించిన దృష్టాంతాలు అనేకం ప్రవక్త (స) కాలంలో దొరుకుతాయి. ఒకసారి ప్రవక్తశ్రీ (స) హజ్రత్ అబూబక్ర్(ర)ను ఒక పోరులో పంపారు. అందులో కొందరు ఖైదీలు పట్టుబడి వచ్చారు. వారిలో ఒక అత్యంత సౌందర్యరాశి అయిన స్త్రీ కూడా ఉంది. హజ్రత్ 'సలమ' బిన్ అక్వ' వాటాలో ఆమె వచ్చింది. దైవ సందేశహరులు (స) పట్టుపట్టి ఆమెను హజ్రత్ సలమ నుండి అడిగి తీసుకుని ఆమెను మక్కాకు పంపి ఆమెకు బదులుగా చాలామంది ముస్లిమ్ ఖైదీలను విడిపించు కున్నారు (ముస్లిమ్, అబూదావూద్, తహావీ, కితాబుల్ అమ్వాల్: అబీ ఉబైద్, తబ్‌కాత్ ఇబ్ను సఅద్). హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ ఉల్లేఖనం ప్రకారం ఒకసారి 'సకీఫ్' తెగవారు ఇద్దరు ముస్లిములను పట్టుకున్నారు. దానికి కొంతకాలం తరువాత 'సకీఫ్'తో ఒడంబడిక దారులయిన 'బనీ ఉకైల్'కు చెందిన ఒక వ్యక్తి ముస్లిముల నిర్బంధంలోకి వచ్చాడు. ప్రవక్తశ్రీ (స) అతన్ని తాయిఫ్‌కు పంపి అతనికి మారుగా ఆ ఇద్దరు ముస్లిము లనూ విడిపించుకున్నారు. (ముస్లిమ్, తిర్మిజీ, ముస్నద్ అహ్మద్). ధర్మవేత్తలలో ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ షాఫియీ, ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ ఖైదీల మార్పిడి ధర్మసమ్మతమయినదే అని భావిస్తారు. ఇమామ్ అబూ హనీఫా అభిప్రాయాల్లో ఒకటి మార్పిడి జరగరాద న్నది. కాని మార్పిడి చేయవచ్చు అనే అభిప్రాయమూ ఉంది. అయితే ముస్లిమ్ అయిపోయిన ఖైదీని మార్పిడిలో తిరస్కారులకు అప్పజెప్పరాదన్న విషయంలో అందరూ ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు.

ఈ వివరణ వల్ల ఒక విషయం తేటతెల్లమయిపోతుంది. ఇస్లామ్‌లో యుద్ధ ఖైదీలకు సంబంధించిన వ్యవహారంలో చాలా విస్తృతమయిన నియమావళి రూపొందించబడింది. అందులో, అన్ని కాలాలకు, అన్ని పరిస్థితులకూ తగినట్లుగా ఈ సమస్యను పరిష్కరించే అవకాశాలున్నాయి. కొందరు దివ్య ఖుర్ఆన్‌లోని ప్రస్తుత ఆయత్ అర్థాన్ని, క్లుప్తమయిన భావం వరకు పరిమితం చేస్తారు. వారి ప్రకారం, ఈ ఆయత్ భావం యుద్ధ ఖైదీలను "సత్కార రూపంలో వదలివేయాలి లేదా పరిహారం తీసుకుని విడుదల చేయాలి" అన్నది. అయితే యుద్ధ ఖైదీల వ్యవహారం ఎన్ని విభిన్న కోణాలు కలిగి ఉందో, అది వివిధ కాలాలలో ఎన్నెన్ని సమస్యలు ఉత్పన్నం చేసిందో, ముప్ముందు కూడా అలా చేయగలదో వారు ఎరుగరు.

సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ

ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం

(కితాబుత్తఫ్సీర్)

2. అల్ బఖరా

అధ్యాయం : 29

పీడన (ఫిత్నా) అంతమయ్యే వరకు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "పీడన (ఫిత్నా) అంతమయ్యే వరకు, దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మానుకుంటే, దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు." *(2: 193)*

364) ఇబ్నె జుబైర్ (రజి) పరీక్షా ఘడియల్లో ఉన్న కాలంలో (హజ్జాజ్ ఆయనపై దాడి చేసి, మక్కా నగరాన్ని ముట్టడించాడు) ఇద్దరు వ్యక్తులు (అలా బిన్ అరార్, హిబ్బాన్ సులమీ) మహనీయ ఇబ్నె ఉమర్(రజి) వద్దకు వచ్చి, "ప్రజలు పరస్పరం కొట్టుకు చస్తున్నారు. మీరు హజ్రత్ ఉమర్(రజి) కుమారులు, ప్రవక్త ప్రియ సహచరులై ఉండి కూడా ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఈ ఉపద్రవాన్ని ఎందుకు సమసిపోయేలా చేయరు?" అని అడిగారు. దానికి ఇబ్నె ఉమర్(రజి)సమాధానమిస్తూ,"నా మౌనానికి కారణం అడుగుతున్నారా? అయితే వినండి! సాటి ముస్లిం ఎవరయినా సరే, అతని రక్తాన్ని అల్లాహ్ నా కొరకు నిషేధించాడు" అని చెప్పారు. "ఏమిటి, ఫిత్నా (పీడన) అంతమయ్యే వరకూ వారితో పోరాడండి అని అల్లాహ్ ఆదేశించలేదా?" అని వారు తిరిగి ప్రశ్నించగా, ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: "(మనం ఖుర్ఆన్ ఆదేశానుసారం) యుద్ధం చేశాము. ఫిత్నా సమసిపోయే వరకూ, అంటే అవిశ్వాసం (కుఫ్ర్), బహుదైవారాధన (షిర్క్) తుద ముట్టించబడే వరకూ పోరాడాము. కడకు దీన్ (దైవధర్మం) కేవలం అల్లాహ్‌కు చెందిన స్వచ్ఛమైన ధర్మంగా నెలకొన్నది. కాని ఇప్పుడు మీరు కోరేదేమిటి? ఫిత్నా (పీడన) మరోసారి పెల్లుబుకాలని, ఇస్లామ్ బలహీనపడిపోవాలని, అవిశ్వాసులకు గెలుపు చేకూరాలని, దైవానికి ఎదురుగా ఇతరుల ఆజ్ఞ చెల్లాలని మీరు కోరుకుంటున్నారా?"

నాఫె కథనం: ఒక వ్యక్తి (హకీమ్) మహనీయ ఇబ్నె ఉమర్(రజి) సన్నిధికి వచ్చి ఇలా అడిగారు: "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! మీకేమైపోయింది? (మీరెందుకిలా నిర్లిప్తంగా ఉండిపోయారు?) మీరు ఒక సంవత్సరం హజ్జ్ చేస్తారు? ఒక సంవత్సరం ఉమ్రా చేస్తారు. కాని దైవమార్గంలో జరిగే సమరంలో పాల్గొనరేమి? దైవ మార్గంలో సాగించవలసిన సమరం గురించి అల్లాహ్ ఎంత గట్టిగా తాకీదు చేశాడో మీకు తెలియనిది కాదు."

సమాధానంగా ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: "అబ్బాయ్! ఇస్లామ్ పునాది అయిదు ప్రధానాంశాలపై ఉంది– 1) అల్లాహ్‌ను, ఆయన సందేశహరుణ్ణి విశ్వసించటం 2) అయిదుపూటల నమాజ్ చేయటం 3) రమజాన్ నెల ఉపవాసాలు పాటించడం 4) జకాత్ ఇవ్వటం 5) హజ్జ్ చెయ్యటం."

దానికి ఆ వ్యక్తి, "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! దైవగ్రంథంలో అల్లాహ్ ఏమని సెలవిచ్చాడో మీకు తెలీదా? 'ముస్లింలలోని రెండు వర్గాలు పరస్పరం సంఘర్షణ పడితే వారి మధ్య సంధి చేయించండి' అని అనబడలేదా? 'వారు దైవాదేశం వైపునకు మరలి వచ్చేదాకా, పీడన సమసిపోయే దాకా వారితో యుద్ధం చేయండి' అని ఆజ్ఞాపించలేదా?" అని గుర్తు చేయగా, ఇబ్నె ఉమర్ (రజి) ఇలా అన్నారు: "దైవప్రవక్త(స) కాలంలో మనం ఈ విధిని నెరవేర్చాము. ఆ కాలంలో ముస్లింలు బహు తక్కువ సంఖ్యలో ఉండేవారు. అవిశ్వాసులు భారీ సంఖ్యలో ఉండేవారు. వారు ముస్లింల ధర్మావలంబనను అడ్డుకునేవారు. కొన్ని చోట్ల ముస్లింలను చంపేసేవారు. కొన్ని చోట్ల వారిని పీడించేవారు. కడకు ముస్లింల జనసంఖ్య పెరిగింది. పీడన (ఫిత్నా) కూడా క్రమేణా అంతరించింది."

అప్పటికీ ఆ వ్యక్తి (ఊరుకోలేదు) ఇలా అడిగాడు: "అది సరేగాని, ఉస్మాన్ (రజి), అలీ(రజి) గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

సమాధానంగా ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: "చూడు! ఉస్మాన్ (రజి) వల్ల జరిగిన తప్పిదాన్ని అల్లాహ్ క్షమించాడు. కాని నీవు ఆ క్షమాపణను మంచిదిగా తలపోయటం లేదు. ఇక అలీ(రజి) అంటావా, ఆయన దైవప్రవక్త(స) పెత్తండ్రి కుమారుడు, ఆయన(స) అల్లుడు కూడా. చూడు! ఆయన ఇల్లు దైవ ప్రవక్త(స) ఇంటికి ఆనుకుని ఉండేది"[1] అని చేత్తో సైగ చేసి మరీ చూపించారు.

364-1. దారి తప్పిన ఖారిజీలు సతతం హజ్రత్ ఉస్మాన్(రజి)ను తూలనాడుతూ ఉండేవారు. ఆయన (ఉస్మాన్-రజి) ఉహుద్ యుద్ధ సందర్భంగా పలాయన వాదాన్ని అనుసరించారన్నది వారి వాదన. హజ్రత్ అలీ(రజి)ని కూడా వారు విమర్శించేవారు. ఎందుకయ్యా అంటే అలీ(రజి) ముస్లింలపై యుద్ధం చేశారని నిందించేవారు.

Neighbour's Rights Campaign

ఆదర్శ పొరుగు ఆదర్శ సమాజం

(గత సంచిక తరువాయి)

అనువాదం: ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

మంచి పొరుగుగా ఉండండి. మంచి పొరుగును తయారు చేయండి

మంచి పొరుగుగా మసలుకునే వారికి మాత్రమే మంచి పొరుగును కాంక్షించే హక్కు ఉంది. మంచి పొరుగుగా రాణించాలంటే మనిషి తనలోని మనసును బాగుంచుకోవాలి. ఆంతర్యంలో కల్మషం ఉండకూడదు. మనసు నిర్మలంగా ఉండాలి. ద్వేషం బదులు ప్రేమ ఉండాలి. దురభిలాష స్థానంలో శ్రేయోభిలాష ఉండాలి. స్వార్థం బదులు త్యాగ భావం ఉండాలి.

కాగా; మంచి పొరుగును రూపొందించుకోవడానికి బయటి పరిసరాలను బాగు పరచాలి. వీధిలో గలాటా బదులు ప్రశాంతత ఉండేలా చూడాలి. చెత్తాచెదారం బదులు వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. దుర్భాష బదులు మంచి భాష మాట్లాడేలా జాగ్రత్త వహించాలి. ప్రజలు రాకపోకలు సాగించే చోట సభ్యత ఉట్టిపడేలా చూడాలి.

ఆహ్లాదకర వాతావరణంలో జీవితం గడపాలని కోరుకునే వారు మంచి ఇరుగు పొరుగు అన్వేషణలో ఉంటారు.

మంచి పొరుగు లభించినప్పుడు, వారి విలువను తెలుసుకోవాలి. ఒకవేళ పొరుగువారు మంచివారు కారనుకుంటే వారిని సంస్కరించటానికి శాయశక్తులా కృషి చెయ్యాలి.

పొరుగువారికి ఊరటనిచ్చే అంశాలు

- ➡ మీ ఇంటి భద్రత నిమిత్తం మీరు సి.సి. కెమెరాలు పెట్టినప్పుడు మీ పొరుగింటి భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోండి.
- ➡ మీ ఇంటి బయట వెలుతురు ఉండే ఏర్పాటు చేసినప్పుడు, ఆ వెలుతురు పొరుగు వారిపై కూడా పడేలా చూడండి.
- ➡ మీ ఇంటి బయట పక్కా దారి ఉన్నప్పుడు మీ పొరుగింటి వారికి కూడా అలాంటి సౌకర్యం ఉండేలా చూడండి.
- ➡ మీ ఇంటి ముందు మ్యాన్‌హోల్ మూసే ఏర్పాటు ఉంటే అలాంటి ఏర్పాటే మీ పొరుగు వారికి కూడా ఉండాలి.
- ➡ మీ పిల్లవాడి కొరకు ట్యూషన్ ఏర్పాటు చేసినప్పుడు, ప్రక్కింటి పిల్లవాడు కూడా ఆ ట్యూషన్ ద్వారా లబ్ధి పొందేలా చూడండి.
- ➡ మార్కెట్లో ఏదయినా వస్తువు చౌకగా దొరుకుతున్నప్పుడు, మీ పొరుగు వారికి ఫోన్ చేసి, వారి కొరకు కూడా ఆ వస్తువును కొనుగోలు చేయండి.

- పొరుగువారు ఎవరయినా వ్యాధిగ్రస్తులైతే వారిని హాస్పిటల్‌కు తీసుకెళ్ళండి. వారికి మందులు తీసుకు రావటంలో, వారి ఇంటి పనులు చేయటంలో వారికి సహాయపడండి.
- పొరుగు వారితో బొత్తిగా అంటీ అంటునట్లుగా ఉండ రాదు. అలా అని వారి ప్రతి విషయంలోనూ అను చితంగా జోక్యం చేసుకోనూరాదు.
- ఆదర్శ పొరుగులో అపారమైన పారదర్శకత (Transparency) ఉండాలి. అందులో 'అతి' ఉండకూడదు. అలా అని మితిమీరిన ప్రైవసీ కూడా ఉండరాదు.
- ఒక అతివాదం ఏమంటే పొరుగింటి వారి గోడలకు చెవులు ఉంటాయి. ఆ చెవులు ఎంతగా రిక్కించి వింటాయంటే ఇంటి రహస్యాలు ఏమాత్రం సురక్షితంగా ఉండవు.
- మరో అతివాదం ఏమంటే పొరుగింటి వారు ఆకలితో ఉన్నా వారిని పట్టించుకోవడం జరగదు. పొరుగిల్లు కాలిపోతున్నా ఆర్పేవారు ఉండరు. పొరుగింట్లో ఎవరయినా చనిపోయినా, కొన్ని రోజులు గడిచే వరకూ తెలిసిరాదు. మృతదేహం కుళ్ళి కంపుకొడితే గాని పట్టించుకోరు.

సాంప్రదాయిక సమాజంలో ఒక్కోసారి పొరుగువారి ప్రమేయం మరీ ఎక్కువైపోతుంది. దాంతో లెక్కకు మించిన సమస్యలు తలెత్తుతుంటాయి. ఇక ఆధునిక సమాజంలో 'ప్రైవసీ' అనేది అతిశయిల్లింది. తత్కారణంగా పరస్పర పరిచయం కూడా గగనమైపోయింది. ఒకప్పుడు పొరుగింటి గోడ మనుషుల ఎత్తుకన్నా తక్కువగా ఉండేది. పైగా గోడ మధ్యలో ఒక చిన్న ద్వారం కూడా ఉండేది. అందులో నుంచి వస్తూ పోతుండే వారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందంటే, ఏళ్ళ తరబడి ఒక అంతస్తులో ఉన్నా ఒకరింకొకరి గురించి అస్సలు పట్టించుకోవటం లేదు.

సాంప్రదాయిక (సనాతన) తరహా సమాజంలో పొరుగువాడు మేలును కోరేవాడై ఉండేవాడు. కాని ఆధునిక సమాజంలో అసలు పొరుగువాడే ఉండడు. సాంప్రదాయిక సమాజంలో పొరుగు వానిలో కొన్ని సద్గుణాలతోపాటు కొన్ని లోపాలు కూడా ఉండేవి. కాని ఆధునిక సమాజం పొరుగువాని మేళ్ళకు, మంచికి బొత్తిగా నోచుకోకుండా పోయింది.

ఇస్లామ్ కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యతను, నైతికతను నొక్కి వక్కాణించినట్లే, పొరుగువారి ప్రాధాన్యతను గురించి కూడా నొక్కి వక్కాణించింది. దాంతోపాటు నైతికతను కూడా ప్రబోధించింది.

ఇమామ్ గజాలీ(రహ్మ) గారు పొరుగువారి గురించి ఎంత సమతౌల్యంతో కూడిన ఐడియా ఇచ్చారో చూడండి:

> "పొరుగువారి హక్కుల సారాంశం ఏమంటే; వారికి సలామ్ చేయటంలో ముందంజవేయాలి. వారి స్థితిగతుల గురించి ఎక్కువ ఆరా తీయకూడదు. వారు వ్యాధిగ్రస్తులైతే పరామర్శించాలి. కష్టాలలో వారిని ఓదార్చాలి. సంతాప సందర్భంగా వారికి ఆదరువుగా నిలబడాలి. సంతోష సందర్భాలలో వారికి శుభాకాంక్షలు తెలియజేయాలి. వారి సంతోషాల్లో పాల్గొని నిండు హృదయంతో ఆనందాన్ని వ్యక్తపరచాలి. వారి పొరపాట్లను ఉపేక్షించాలి. ఇంటి కప్పుపై నుండి వారి రహస్య విషయాలపై కన్నేసి ఉంచరాదు. ఇంటి చూరును బిగించినా, ఆవరణలో మట్టిని తోలినా అది పొరుగువారికి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. గుప్తంగా ఉండాల్సిన పొరుగు వారింటి వస్తువు ఏదయినా బయటపడితే, దానిపై తెరవేసి మరుగుపరచాలి. పొరుగువారు ఏదయినా ఆపదలో చిక్కుకుంటే వారికి అండగా నిలబడాలి. వారు లేని సమయంలో వారి ఇంటిని కనిపెట్టుకుని ఉండాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం కూడదు. వారికి వ్యతిరేకంగా ఉండే మాటలు వినకూడదు. వారి చేష్టలను అదే పనిగా కొరకొరా చూడకూడదు. వారి పిల్లలతో మృదువుగా మాట్లాడాలి. వారికి తెలియని ప్రాపంచిక, పారలౌకిక విషయాలను వారికి ఎరుకపరచాలి."
>
> *(ఇహ్యాఅ ఉలూముద్దీన్)*

హాని కలిగించకండి. మీకు జరిగే హానిపై ఓర్పు వహించండి

ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు :

> "దైవసాక్షిగా! అతను విశ్వాసి కాడు. అతను విశ్వాసి కాడు, అతను విశ్వాసి కాడు." 'దైవప్రవక్తా! ఎవరతను?' అని అడగ్గా, "ఎవరి దుష్టచేష్టల వల్ల అతని పొరుగువాడు సురక్షితంగా లేడో ఆ వ్యక్తి" అని ఆయన(స) చెప్పారు.
>
> *(బుఖారీ)*

పొరుగువారికి సంబంధించి ఇస్లామ్ చేసిన బోధనలు మనిషిని అత్యున్నత స్థానానికి చేరుస్తాయి.

దానికి సంబంధించిన ఒక కోణం ఏమిటంటే, పొరుగు వారి పట్ల సద్భావంతో మెలగాలి. ఖుర్ఆన్‌లో, సున్నతులో దాని గురించి చాలా గట్టిగా తాకీదు చేయటం జరిగింది.

మరో కోణం ఏమిటంటే; పొరుగువారిని కష్టపెట్టకూడదు.

దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు :
"అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి తన పొరుగు వారిని బాధించకూడదు." *(బుఖారీ)*

సంస్కారవంతులు తమ పొరుగు వారిని తెలిసీ - ఉద్దేశ పూర్వకంగా- బాధిస్తారని అనుకోలేము. కాని వారికి తెలియ కుండానే వారి ప్రవర్తన వల్ల పొరుగు వారికి బాధ కలిగేందుకు ఆస్కారం ఉంది. అందుచేత రెండవ కోణం గురించి చాలా జాగ్రత్తగా మెలగవలసిన అవసరం ఉంది.

మూడవ కోణం ఏమిటంటే, వారి వైపు నుండి ఏదయినా బాధాకరమైన విషయం ఎదురైతే, దానిపై ఓర్పు వహించాలి. అంతేకాదు, వారి వేధింపులను సత్ప్రవర్తన ద్వారా తిప్పి కొట్టాలి.

దైవసందేశహరులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారు : "తన పొరుగువాడు బాధిస్తున్నప్పటికీ దానిపై ఓర్పు వహించే వ్యక్తిని అల్లాహ్ ఇష్టపడతాడు." *(ముస్నద్ అహ్మద్)*

ఇమామ్ హసన్ బస్రీ (రహ్మ) ఇలా నుడివారు: "తన పొరుగు వారిని కష్టపెట్టకుండా ఉండటం మంచితనానికి తార్కాణం కాదు. పైగా తనకు పెట్టబడిన కష్టాలను సహించటమే మంచి తనానికి నిదర్శనం" *(జామెవుల్ ఉలూమ్ వల్ హుక్మ్)*

విశ్వాస (ఈమాన్) శక్తి లేకుండా ఈ ఉన్నత స్థాయికి చేరటం సాధ్యం కాదు.

పొరుగు వారికి బాధ కలిగించే కొన్ని అంశాలు

- హెచ్చు శబ్దంతో రేడియో, టివి, టేప్ రికార్డర్లను ఆన్ చేయటం.
- మన ఇంటిని ఊడ్చిన మీదట ఆ చెత్తా చెదారాన్ని ఇంటి బయట పడవేయటం.
- ఏసీ యంత్రం నుండి బయట వెలువడే వేడి పొరుగింటి వారికి బాధ కలిగించే చోట బిగించటం.
- మన టాయిలెట్ పరిశుభ్రంగా లేకపోతే, దాని నుండి వచ్చే దుర్వాసన పొరుగు వారికి బాధ కలిగిస్తుంది.
- అనుదినం ఇంట్లో జరిగే గొడవలు, అరుపులు (ఈ కంఠ శోషకు పొరుగువారు తట్టుకోలేకపోవటం).
- పొరుగింటి వారి గుమ్మం వద్దనే మన వాహనాన్ని నిలపటం.

పొరుగువారితో సామూహిక వ్యవస్థ

పొరుగు వారి మధ్య పరస్పర పరిచయాలు ఉండాలి. వారు ఒండొకరి స్థితిగతుల గురించి తెలుసుకుంటూ ఉండాలి. ఇది చాలా అవసరం. మహనీయ ముహమ్మద్ (స) ఇలా వక్కాణించారు: "తన పొరుగువాడు ఆకలితో ఉండగా తాను మాత్రం కడుపు నిండా- సుష్టుగా - తినేవాడు విశ్వాసి కాడు" (అల్ అదబుల్ ముఫ్రద్, బుఖారీ). ఈ ఉపదేశంలో అంతర్లీన మైన మరో విషయమేమంటే, ఒక పొరుగు వానికి తినటానికి ఏమీ లేకపోతే, సాటి ఇరుగు పొరుగు వారికి ఆ సంగతి తెలిసి ఉండాలి.

విషయం తెలిసిన మీదట సాధ్యమైనంత వరకు అతని అవ సరం తీర్చాలి. ప్రాచీన కాలంలో జీవితం సాదాసీదాగా ఉండేది. అవసరాలు చాలా తక్కువగా ఉండేవి. వ్యక్తిగత సహాయంతో కూడా సమస్య పరిష్కారమైపోయేది. కాని ప్రస్తుత జీవితం చిక్కు సమస్యలతో కూడుకున్నది. అవస రాలు చాంతాడంత పొడవైపోయాయి. తత్కారణంగా ఒక మనిషి చేసే సహాయంతో సమస్య పరిష్కారం కాదు. కాబట్టి ఇరుగు పొరుగు వారంతా కలసి చిన్న చిన్న సొసైటీలు స్థాపిస్తే సమస్యలు చాలా తేలిగ్గా పరిష్కృతమవుతాయి.

పొరుగు వారి సామూహికత (క్రియాత్మక సూచనలు)

- వీధి లేక వాడ పరిశుభ్రత నిమిత్తం ఒక ఫండ్‌ను సమకూర్చుకోవాలి.
- కార్ పార్కింగ్‌కు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలి.
- వీధి (లేక) వాడ రక్షణ కోసం తగిన బందోబస్తు.
- పరస్పర వివాదాలను శాంతియుతంగా పరిష్కరించు కోవడానికి సామూహిక వ్యవస్థ.
- బస్తీలోని పేద ప్రజల అవసరాలు తీర్చడానికి ఒక ఫండ్ ఏర్పాటు చేసుకోవాలి.
- వీధి (లేక బస్తీ)లోని పిల్లలకు పూటబడుల (మక్తబ్‌ల) ద్వారా ధార్మిక విద్య నేర్పటం.

పొరుగు వారికి కేంద్ర స్థానం మస్జిద్

సాధారణంగా ప్రతి బస్తీలో ప్రజలు సమావేశమయ్యే స్థలాలు (చావిడీలు) ఉంటాయి. అయితే వీటన్నింటిలోకీ చాలా మంచి స్థలం మస్జిద్. మస్జిద్‌కు గల ప్రాముఖ్యత ఏమిటంటే, అక్కడ చాలా మంది సమావేశమవుతుంటారు. ఒకేరోజు అనేకసార్లు వస్తుంటారు. మస్జిద్‌లో కేవలం సామూహిక నమాజ్ మాత్రమే అవదు. ప్రజలు సామూహికంగా కలుసు కుంటుంటారు. ఈ సమావేశాల సందర్భంగా పొరుగువారి ప్రస్తావన కూడా వస్తుంటుంది. వారిలో అవసరార్థులైన వారి సహాయం కొరకు విజ్ఞప్తి చేయబడు తుంది. రోగుల ఆరోగ్యం కొరకు వేడుకోవటం జరుగుతుంది.

మస్జిద్ లోపల జరిగే సమావేశాలలో ఆప్యాయత ఉట్టిపడి నట్లే, వీధి (బస్తీ)లోని సమస్యలకు సంబంధించి కూడా ఉత్సాహం, ఆసక్తి తొణికిసలాడుతూ ఉంటుంది. కాబట్టి

మస్జిద్ ద్వారా పొరుగువారి సంబంధాలను పటిష్ట పరిచేందుకు యత్నించాలి.

మస్జిద్‌లోని పొరుగువారి హక్కులు (క్రియాత్మక హితవులు)

- మస్జిద్‌లో ప్రవేశించేందుకు కేవలం వుజూతో ఉంటేనే సరిపోదు. కాళ్ళు శుభ్రంగా ఉండాలి. మేజోళ్ళ నుండి వచ్చే దుర్వాసన తోటి వారికి భరించ శక్యం కానిదిగా ఉంటుంది. అలా జరగకుండా చూసుకోవాలి.
- మీ దుస్తులు పరిశుభ్రంగా, పరిశుద్ధంగా ఉండాలి. దుస్తుల్లో నుండి వచ్చే చెమట వాసన సాటి నమాజీలకు బాధ కలిగిస్తుంది.
- పిల్లలను మస్జిద్‌కు తీసుకువస్తూ ఉండండి. అయితే మీ పిల్లలు ఇతర నమాజీల నమాజ్‌కు ఆటంకం కలిగించకుండా చూసుకోవలసిన బాధ్యత మీదే.
- మస్జిద్‌లో బిగ్గరగా మాట్లాడి, అక్కడి ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టరాదు.
- మస్జిద్ ఆవరణలో, వచ్చేపోయే నమాజీలకు ఇబ్బంది కలిగే విధంగా వాహనాలను నిలబెట్టకండి.
- మస్జిద్‌లో ప్రవేశించే ముందు మీ మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ చేయండి.
- మస్జిద్‌లో ఎవరి వల్లనయినా ఏదయినా తప్పు జరిగితే మృదువుగా సంస్కరించండి, కోపంతో చెప్పవద్దు.

పొరుగువారి సంస్కరణ

పొరుగువాని హక్కులను గురించి ఒక్క మాటలో చెప్పాలంటే, అతని భౌతిక, ప్రాపంచిక అవసరాలు తీర్చాలి. ఇస్లామీయ సాహిత్యంలో మనకు పొరుగువారి హక్కులకు సంబంధించిన విస్తృతమైన దృక్పథం లభిస్తుంది. ఒక హదీసుకు వివరణగా విద్వాంసులు ఇలా అంటున్నారు: "ఒక పొరుగు వానికి తన పక్కింటి వారిపై గల బాధ్యత ఏమిటంటే, అతనికి అవసరమైన జ్ఞాన సంపద అతనికి పంచిపెట్టాలి." *(ఫత్‌హుల్ బారీ)*

పొరుగు వారి నైతిక, ధార్మిక సంస్కరణకై శ్రద్ధ వహించటం కూడా పొరుగు వారి హక్కులలో చేర్చటం జరిగింది. అల్లామా ఇబ్నె హజర్ (రహ్మ) ఇలా వ్రాశారు:

> "పొరుగువాడు మంచివాడైనా, మంచివాడు కాకపోయినా- అతని పట్ల శ్రేయోభిలాషిగానే మసలుకోవాలి. అతనికి అత్యుత్తమ రీతిలో బోధపరచాలి. అతనికి సన్మార్గం చూపమని (దైవాన్ని) ప్రార్థించాలి. మరీ అవసరమైతే తప్ప అతని పట్ల కఠినంగా వ్యవహరించకూడదు. ఈ విషయాలకు సంబంధించి నంతవరకు సద్వర్తనులు, దుర్వర్తనులు- రెండు రకాల వారు కూడా సమానులే. కాకపోతే దుర్వర్తనుడైన పొరుగువాడు చెడుకు ఒడిగట్టినప్పుడు, అతనిని చెడు నుండి నిరోధించడానికి పద్ధతి ప్రకారం నిరోధించాలి. ఇక చెడిపోయిన వాని విషయానికి వస్తే, అతనికి కూడా సముచితమైన రీతిలో- మృదువుగా- విషయాన్ని విడమరచి చెప్పాలి. అతని తప్పులను మరుగుపరచాలి. అతనిని చెడుల నుండి మృదువుగా వారించాలి. ఒకవేళ అతను మాట వినకపోతే, అతనికి శిక్షగా (శిక్షణగా) అతనికి దూరంగా ఉండాలి. అతనితో ఎందుకు అలా దూరంగా ఉంటున్నారో కూడా అతనికి ఎరుక పరచాలి." *(ఫత్‌హుల్ బారీ)*

అందరికన్నా మంచి పొరుగుగా ఉండండి

అన్ని రకాల పొరుగువారితో సద్భావంతో మెలగవలసిందిగా దివ్య ఖుర్‌ఆన్ ప్రబోధిస్తుంది.

దైవప్రవక్త(స) పొరుగు వారి హక్కులకు సంబంధించి చాలా గట్టిగా తాకీదు చేశారు.

దైవదూత జిబ్రీల్(అలైహిస్సలామ్) పొరుగు వారి హక్కుల గురించి నిరంతరం- పదేపదే- చెప్పారు.

కాబట్టి- దైవ ప్రసన్నతను చూరగొనటానికి, పరలోక సాఫల్యం పొందడానికి మీరు ప్రతి ఒక్క పొరుగు వానితో మంచిగా మెలగండి. ఇలా చేస్తే-

- మీరు సమీప పొరుగువారి కొరకు కూడా మంచి పొరుగు కాగలరు.
- దూరపు పొరుగు వారి కొరకు కూడా మంచి పొరుగుగా రాణించగలరు.
- తాత్కాలిక పొరుగు వారి కొరకు కూడా మంచి పొరుగుగా గుర్తింపు పొందుతారు.
- డిజిటల్ ప్రపంచపు పొరుగు వారి దృష్టిలో కూడా మంచి పొరుగు కాగలరు.
- మీ వీధిలోని వారు, మీ బస్తీలోని ప్రజలు మీరొక మంచి పొరుగు అని సాక్ష్యమిస్తారు.
- మీ బస్తీలోని మస్జిద్ మిమ్మల్ని మంచి పొరుగుగా ధ్రువీకరిస్తుంది.
- మీరు నడిచే త్రోవలు మీరొక మంచి పొరుగు అని సాక్ష్యమిస్తాయి.

-: సమాప్తం : -

బరువు పెరిగిందా?

- నసీమ్ సుల్తానా

అందం తరాజులో మన మనసు ఎందుకు ఓడిపోతోంది? ఇస్లాం బోధించే అసలు 'గుణ సౌందర్యం' ఎక్కడ?

"మీరు కాస్త లావయ్యారేమో..."

"మీ చర్మంపై మొటిమలు మరీ ఎక్కువగా వస్తున్నాయి..."

"ఎత్తు పెరగాలంటే ఆ వ్యాయామమే చేయాలి సుమా..."

ఈ మాటలు చాలా పరిచయమే కదా? మనం ఒకరిలో మొదట గమనించేది వారి రూపాన్ని, దురదృష్టవశాత్తూ, దాని గురించే మొదట వ్యాఖ్యానించడం జరుగుతుంది. చివరిసారి కలిసినప్పటి నుంచి వారిలో వచ్చిన మార్పుపైనే మన మాటలు గుచ్చుకుంటాయి. మాట్లాడేవారికి ఇవి మామూలు మాటలే కావచ్చు, కానీ వినేవారి మనసుకు అవి ఎంత లోతైన గాయాలు చేస్తాయో మనం ఎప్పుడైనా ఆలోచించామా?

గౌరవం

ఏ ఆరోగ్యకరమైన సంబంధానికైనా ప్రాథమిక మూలకం గౌరవం. అది వ్యక్తిగత స్థాయిలో అయినా, సామాజిక స్థాయిలో అయినా. ప్రేమ, ఎదుగుదల, కరుణ ఉండే సామరస్యపూర్వక సమాజానికి గౌరవమే కీలకం.

పెద్దలకు మర్యాద ఇవ్వడం ఎంత ముఖ్యమో, పిల్లలకు, యువకులకు కూడా అంతే గౌరవం ఇవ్వాలి. వయస్సుతో సంబంధం లేకుండా, ప్రతి ఒక్కరూ గౌరవించాలి, గౌరవించ బడాలి. అప్పుడే సమాజం మొత్తం పురోగమిస్తుంది.

అందుకే, ఇతరుల శరీరాకృతి గురించి వ్యాఖ్యలు చేయడం అనేది కఠినంగా 'వద్దు' (Strict No-No) కావాలి.

అసలు పుణ్యం

తీర్పు రోజున మన త్రాసులో అత్యంత బరువుగా ఉండేది మన అఖ్లాఖ్ (ఉత్తమమైన నడవడిక, మంచి గుణం). నిస్సందేహంగా, మన సుదీర్ఘ ప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలు అన్నీ గొప్ప ప్రతిఫలాన్ని ఇస్తాయి. కానీ, మంచి నడవడిక పుణ్యంతో వాటిని పోల్చలేం.

అయితే ఇక్కడే అసలు విషయం ఉంది: మంచి అఖ్లాఖ్‌ను నటించలేం! పండితులు హృదయాన్ని ఒక పాత్రతో పోలిస్తే, నాలుక ఆ పాత్రలోని గరిటె లాంటిది అంటారు. హృదయంలో ఏముందో, నాలుక అదే బయటకు తీస్తుంది. ఇతరులను మనం నిజంగా గౌరవించి, 'బాడీ-షేమింగ్' ఒక అవమానమని, పూర్తిగా తప్పని హృదయపూర్వకంగా నమ్మినప్పుడే, ఆ గౌరవం మన మాటల్లో ప్రతిబింబిస్తుంది. నిజమైన గౌరవం పైపై మెరుగు కాదు, అది మన అంతరాత్మలో ఉండాలి. ఇస్లాం ప్రోత్సహించే ఆ అద్భుతమైన గుణాన్ని ప్రదర్శించడానికి ఇదే మార్గం.

నిజమైన అందం

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితంలో హత్తుకునే సంఘటనలు ఉన్నాయి.

◆ ఒకానొక సహాబి అంత అందంగా ఉండేవారు కాదు. ఒకసారి ప్రవక్త (స) మార్కెట్‌లో వెనుక నుంచి సరదాగా ఆలింగనం చేసుకుని, "నువ్వు అల్లాహ్‌కు అమూల్యమైన వాడివి!'' అని ప్రకటించారు. ఆయన రూపాన్ని పట్టించుకోలేదు, అతని వ్యక్తిత్వానికి విలువ ఇచ్చారు.

◆ అబ్దుల్లా ఇబ్న్ మసూద్ (రజి అల్లాహు అన్హు) సన్నని కాళ్ళను సహచరులు ఎగతాళి చేసినప్పుడు, ప్రవక్త (స) వారిని మందలించి, "పునరుత్థాన దినమున, అబ్దుల్లా కాళ్ళు ఉహుద్ పర్వతం కంటే త్రాసులో బరువుగా ఉంటాయి" అని చెప్పారు.

దీని నుంచి మనం అర్థం చేసుకోవాలి: నిజమైన అందం అనేది ఈమాన్ (విశ్వాసం)లో, ఆ ఈమాన్ ప్రేరేపించే సద్గుణాలలో ఉంటుంది. అల్లాహ్ మన రూపాన్ని చూడకుండా, మన హృదయాల్లో ఉన్న తఖ్వా ఆధారంగా తీర్పు చెప్పినప్పుడు, మనం మన సొంత ప్రమాణాలను సృష్టించడానికి మనం ఎవరు?

ఎందుకు మనం ఇలా తయారయ్యాం?

మంచి పనులు చేసేవారికి ఎలాంటి కారణం లేకుండానే ఒక ప్రత్యేకమైన అందం వస్తుందని గమనించలేదా? దయగల మాటలు, మర్యాదపూర్వక ప్రవర్తన, సహాయం చేసే మనస్తత్వం ఒక వ్యక్తిని అద్భుతంగా తీర్చిదిద్దవా?

దురదృష్టవశాత్తూ, అందం గురించి బాహ్య ప్రమాణాల కారణంగా ఈ సద్గుణాలు పక్కకు పోయాయి. ఇతరుల చర్మం, జుట్టు, శరీరంపై దృష్టి కేంద్రీకరించి, నిజమైన అందం ఎక్కడ ఉందో మర్చిపోయాం.

బాడీ-షేమింగ్‌కు మూలకారణాలు ఏమిటి?

1. తప్పుడు అందం ప్రమాణాలు

ప్రధాన స్రవంతి మీడియా (Media) మనకు కథనాన్ని చెబుతోంది. తెరపై కనిపించే వ్యక్తి ఖచ్చితమైన మేకప్, జీరో సైజ్ ఫిగర్‌తో ఉండవచ్చు. అది గంటల తరబడి శ్రమించి, కెమెరా కోసం సిద్ధం చేసిన రూపం. అది వాస్తవ జీవితంలో సాధారణం కాదు, కేవలం ఒక 'ప్రదర్శన' మాత్రమే.

2. అతిగా మాట్లాడటం (The Loose Tongue)

ఎక్కువగా మాట్లాడే అలవాటు ఉన్నప్పుడు, మనం ఆలోచించకుండా వాగుతాము. అధికంగా మాట్లాడే వ్యక్తి ఎక్కువ పాపాలను సంపాదించుకోవచ్చు. మాట్లాడటానికి ఇంకేమీ లేనప్పుడు, అర్థం లేని, పనికిరాని వ్యాఖ్యల వైపు దృష్టి మళ్లిస్తాము. ఒక ముస్లిం మాట్లాడే ముందు, తన మాటలను హృదయం అనే వడపోత ద్వారా వడపోస్తాడు: "ఈ మాట దయతో కూడినదా? ఇది సహాయకారిగా ఉందా? ఇది అవసరమా?"

3. ఉన్నత లక్ష్యం లేకపోవడం (Lack of Higher Purpose)

అల్లాహ్ మనల్ని గొప్ప ప్రయోజనం కోసం సృష్టించాడని మనం గుర్తించాలి. మన మనస్సులకు అపారమైన సామర్థ్యం ఉంది. ఇతరుల బరువులు, ఎత్తుల గురించి మాట్లాడటానికి బదులుగా, మన సమయాన్ని, వివేకాన్ని గొప్ప పనుల కోసం ఉపయోగించాలి. జీవితం అంటే గాసిప్‌లు, ఎగతాళి చేయడం, అవాస్తవ అందం ప్రమాణాలు కాదు.

4. విషపూరిత ప్రశంసలు, అడగని సలహా (The Toxic Advice)

"మీ మొటిమలు ఇప్పుడు చాలా తగ్గాయి!" లేదా "చర్మం తెల్లబడటానికి పెరుగు వాడండి" వంటి మాటలు నిశ్శబ్ద హంతకాలు. వీటిని దయగా లేదా సహాయం చేయాలనే కోరికగా ముసుగు వేసినప్పటికీ, మనం ఎదుటి వ్యక్తికి వారి లోపాల గురించి మరింత ఆందోళన కలిగిస్తున్నాము. మనం ఎంత చెప్పినా, ఇవి వారి శ్రేయస్సు కోరి మాట్లాడిన మాటలు కావు.

గుర్తుంచుకోండి: దైవదూతలు (Angels) మన ప్రతి పదాన్ని వ్రాస్తున్నారు. ఒక సగటు మనిషి రోజుకు 15,000 నుండి 20,000 పదాలు పలుకుతాడు. ఒక జీవితకాలంలో, ఇది దాదాపు 3500 నవలలకు సమానం కావచ్చు. అల్లాహ్ ముందు నిలబడి, ఆ ప్రతి ఒక్క పదాన్ని మనం సమర్థించుకోగలమా? అవన్నీ మనకు అనుకూలంగా ఉంటాయా?

ఆలోచించండి. ఈ రోజు నుంచైనా మీ మాటలకు ఆదబ్ నేర్పండి.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

కథ

- షహనాజ్ బేగం, అనంతపురం

తల్లిదండ్రుల బాధ్యత

"యధా రాజా తథా ప్రజా" అన్నారు పెద్దలు. రాజ్యానికి పాలకుడు నీతిమంతుడైతే, ప్రజలు కూడా ఉత్తములుగా ఉంటారు. ఆ నీతి తప్పితే, రాజ్యం అస్తవ్యస్తమై, విచ్ఛిన్నమవుతుంది.

ఈ సిద్ధాంతం ఇంటి పెద్దకు, కుటుంబానికి కూడా వర్తిస్తుంది. ఇంటి యజమాని నడవడిక సరిగాలేకుంటే, ఆ కుటుంబం నిస్సందేహంగా పతనమవుతుంది.

మా పక్క పోర్షన్‌లో ఉండే హనీఫ్ కుటుంబం... ఆ పతనానికి సజీవ సాక్ష్యం. ఆ ఇంటి గోడలు ఎప్పుడూ కలహాల ఆర్తనాదాలతో, కర్ణకఠోరమైన కేకలతో దద్దరిల్లుతుంటాయి. భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు- పిల్లల మధ్య నిత్యం పోరాటమే. కంచాలు విరిగిపడ్డట్టు, బంధాలు తెగిపడ్డట్టు అనిపిస్తుండేది.

ఆ పెడబొబ్బలు విన్నప్పుడు కలిగే విసుగును, అసహనాన్ని కూడా మేము వ్యక్తం చేయలేకపోయేవాళ్ళం. ఎందుకంటే, హనీఫ్ మాకు దూరపు చుట్టం, కావలసినవాడు.

"ఏమిటీ భాయ్, మీ ఇంట్లో గొడవ? అంతా క్షేమమేనా?" అని బాధ్యతగా అడిగితే, అతను నిర్లక్ష్యంగా తల పంకించి, ఏదో గొణుక్కుంటూ, భారంగా నిట్టూరుస్తూ మాట మార్చేసేవాడు. లేదా అక్కడి నుంచి తప్పించుకు వెళ్ళిపోయేవాడు.

ఒక సంస్థలో పనిచేసే హనీఫ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కాలేజీ చదువుల పేరుతో... వాళ్ళు ఇంటికి, తమకిష్టం వచ్చిన షాపింగ్ మాల్స్‌కు, రెస్టారెంట్లకు మాత్రమే పరిమితం అయ్యేవారు. వారిలో ఆధ్యాత్మికతకు అస్సలు చోటు లేదు. స్వేచ్ఛ అనేది అదుపులేని పెను తుఫాన్‌లా మారింది. తల్లిదండ్రులతో వాదోపవాదాలకు దిగడం వారికి నిత్యకృత్యం.

మా రోజులు వేరు. తండ్రి ఎదుట గట్టిగా మాట్లాడే ధైర్యం మాకు ఉండేది కాదు. ఏ అవసరం వచ్చినా అమ్మ ద్వారానే విన్నవించుకునేవాళ్లం. మా భయభక్తులు... తండ్రి మంచాన పడిన వృద్ధాప్యంలోనూ చెక్కుచెదరలేదు. అదే సంస్కారం.

కానీ, ఈ కాలపు తల్లిదండ్రులు 'స్వేచ్ఛ' అనే విషబీజాన్ని తమ పిల్లల పెంపకంలో వేశారు. ఇప్పుడు దాని చేదు ఫలితాన్ని అనుభవిస్తున్నారు.

ఆ భయంకరమైన వేకువజాము

ఒక తెల్లవారుజామున నా ఫోన్ మోగింది. ప్రక్క పోర్షన్ హనీఫ్ భాయ్. "కొంచెం పని ఉంది, బయటికి వెళ్దామా?" అతని గొంతులో వణుకు, కళ్ళల్లో కన్నీరు... ఏదో పెద్ద ఆపదలో ఉన్నాడని వెంటనే గ్రహించాను. నన్ను పట్టుకుని ఏడవడమే తక్కువ.

బైక్ తీస్తూ అడిగాను: "ఎక్కడికి వెళ్ళాలి?"

అతను చెప్పిన విషయం గుండెను పిండేసింది. నిన్న మధ్యాహ్నం స్నేహితుడి బర్త్‌డే పార్టీకి వెళ్లిన ఇద్దరు కూతుళ్లు ఇంకా ఇంటికి తిరిగి రాలేదట. సిటీ అవతల ఒక ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతోందని చెప్పారట. రాత్రి గడిచినా

వారి జాడ లేదు. ఫోన్లు స్విచ్ఛాఫ్. వాళ్ళ స్నేహితులకు ఫోన్ చేస్తే, తమ పెద్దలు అంత దూరం పంపించడానికి కట్టడి చేశారని చెప్పారట.

ఈ మాట విని నా గుండెలోంచి ఒక భారీ నిట్టూర్పు వెలువడింది.

''ఇప్పుడు ఏడ్చి ఏం లాభం? తల్లిగా, తన బాధ్యతను గుర్తుచేసుకుని ఉంటే ఇలా జరిగేదా?'' లోపల ఆయన భార్య ఏడుపు వినిపిస్తోంది. పిల్లలకు పూర్తిగా స్వేచ్ఛనిచ్చి, ఇప్పుడు ఈ దారుణ ఫలితం అనుభవించక తప్పదు కదా. రోజు రోజుకూ హత్యాచారాల వార్తలు, నేరాల ఉచ్చులో పడే అమాయక యువత.

మొన్ననే అతని కొడుకు మెహసిన్‌ను అర్ధరాత్రి బైక్ మీద తిరుగుతుంటే పోలీసులు అనుమానంతో పట్టుకున్నారు. అప్పుడు మేము వెళ్ళి విడిపించుకుని, ఆ కుర్రాడికి హితబోధ చేసి వచ్చాం.

బైక్‌పై బయలుదేరాం. రైల్వే స్టేషన్, బస్టాండ్, చివరికి ఆ ఫామ్‌హౌస్... ఎక్కడా సమాచారం లేదు. పార్టీ సాయంత్రమే ముగిసిపోయిందని తెలిసింది. ఇక చేయగలిగిందల్లా ఒకటే: పోలీస్ స్టేషన్‌కు బయలుదేరాం. ఫిర్యాదు చేయడానికి.

అతను భయంతో వణికిపోతున్నాడు. ''పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే నలుగురికీ తెలిస్తే ఎంత అవమానం! రేప్పొద్దున వారికి పెళ్ళిళ్ళు... నా పిల్లలు ఇంత చేస్తారని అనుకోలేదు! వాళ్ళకేమీ తక్కువ చేయలేదు కదా!'' అని మొహం చేతుల్లో దాచుకుని బోరున ఏడ్చాడు.

నేను ఈ అవకాశాన్ని వదులుకోదలుచుకోలేదు. ఆ క్షణంలోనే అతనికి జ్ఞానోదయం కలిగించాలి అనుకున్నాను.

''మీ తప్పేమీ లేదు భాయ్! మీ బాధ్యతను సరిగ్గా నిర్వర్తించారా ఎప్పుడయినా? డబ్బు ఇచ్చారు, స్వేచ్ఛనిచ్చారు. కానీ వారి చదువుల పట్ల, వారి నడవడిక పట్ల శ్రద్ధ తీసుకున్నారా? తల్లిదండ్రులుగా మీ పవిత్ర బాధ్యతను మరచిపోయి... మీరు మీ ఉద్యోగంలో, స్నేహితుల్లో బిజీగా ఉండిపోయారు. తల్లి కూడా తన బంధుత్వాలు, రాజకీయాలలో పడిపోయింది. మీరు వదిలేస్తే, వాళ్ళు చేయి దాటిపోయారు!'' అంటూ చాలాసేపు హితబోధ చేశాను.

పోలీస్ స్టేషన్‌లో ఇంకేం వినవలసి వస్తుందో, ఇంకెన్ని చేదు నిజాలు తెలుస్తాయో అని మా గుండెలు భయంతో కొట్టుకుంటున్నాయి. సమయం గడిచేకొద్దీ అతని టెన్షన్ తారాస్థాయికి చేరుకుంది.

సుఖాంతం... ఒక మార్పుకు నాంది

పోలీస్ స్టేషన్ సమీపంలోకి చేరుకుంటుండగా హనీఫ్ సెల్‌ఫోన్ మోగింది. అవతలి నుంచి అతని భార్య... హనీఫ్ ముఖంలో రంగులు మారాయి. కొద్దిసేపటి తరువాత: ''పద ఇంటికి వెళ్దాం'' అన్నాడు.

అమ్మాయిలిద్దరూ ఇంటికి చేరుకున్నారట. పార్టీలో గొడవ జరిగి, కొట్టుకునే వరకు రావడంతో ఎవరో పోలీసులకు ఫిర్యాదు చేశారట. అందరూ భయపడి చెల్లాచెదురై పారిపోయారట. ఆ గందరగోళంలో వారి ఫోన్లు పోయాయట. రాత్రంతా ఒక స్నేహితురాలి ఇంట్లో తలదాచుకుని ఇలా వచ్చారట. ఇంకెప్పుడూ ఇలా చేయమని కన్నీళ్లు పెట్టుకున్నారట.

ఎట్టకేలకు కథ సుఖాంతమైంది.

ఆ సంఘటన తరువాత ఆ తల్లిదండ్రులలో ఒక స్పష్టమైన మార్పు కనిపించింది. పురుషుడు ఎప్పుడూ ఒక భర్తగా, తండ్రిగా తన బాధ్యతలను నిక్కచ్చిగా నిర్వర్తించాలి. స్త్రీ కూడా ఒక ఇల్లాలిగా, తల్లిగా తన కుటుంబం పట్ల పూర్తి బాధ్యత కలిగి ఉండాలి.

స్వేచ్ఛకు హద్దు ఉండాలి. బాధ్యతకు నిర్వచనం ఉండాలి. ఈ సత్యాన్ని తల్లిదండ్రులు తెలుసుకున్నప్పుడే, ఈ సమాజం బాగుపడుతుంది. లేదంటే... చెదిరిన గూళ్లు మిగిలే ఉంటాయి.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

మట్టి మన ఉనికికి మూలం

- డాక్టర్ ఫర్హీన్ సుల్తానా

నేల... మన పాదాల కింద నిశ్శబ్దంగా నిద్రిస్తున్న ఈ సన్నని పొరను మనం తరచుగా "భూమి యొక్క చర్మం" అని పిలుస్తాం. కానీ, ఈ మట్టి పెళ్లలో దాగి ఉన్న ప్రాముఖ్యత, పవిత్రత, జీవన చక్రం అపారం. ఖురాన్ బోధనల నుండి ఆధునిక శాస్త్ర పరిశోధనల వరకు, నేల అనేది కేవలం భౌతిక పదార్థం కాదు, ఇది మన అస్తిత్వానికి, మనుగడకు, ఆధ్యాత్మికతకు కేంద్ర బిందువు.

మానవ సృష్టిలో నేల పాత్ర

ఖురాన్ గ్రంథం నేలను అత్యంత పవిత్రమైన, ప్రాథమికమైన అంశంగా ప్రకటిస్తుంది.

మనిషి మూలం : సృష్టికర్త మన సృష్టిని నేరుగా మట్టితో సృష్టించాడని ఖురాన్ స్పష్టం చేస్తుంది. "ఆయన మానవ సృష్టి ప్రారంభాన్ని మట్టితో చేశాడు." (32:7) "ఈ నేల నుండే మేము మిమ్మల్ని సృష్టించాము, దానిలోనికే మేము మిమ్మల్ని తిరిగి తీసుకు పోతాము. దాని నుండే మిమ్మల్ని మళ్లీ వెలికి తీస్తాము." (20:55) వంటి ఖుర్ఆన్ వాక్యాలు, మన శరీరం మూలం మట్టి అని, అంతిమంగా మనం మళ్లీ మట్టిలోనే కలవాలనే జీవిత చక్ర సత్యాన్ని గుర్తుచేస్తాయి.

పర్యావరణ ధర్మం : భూమి యొక్క లక్షణాలు, దాని సారవంతంపై మన జీవితం ఆధారపడి ఉందని ఖురాన్ స్పష్టంగా చెబుతుంది. "మంచి నేల తన ప్రభువు ఆదేశాను సారం పుష్కలంగా పంటనిస్తుంది. చెడ్డ నేలలో నాసిరకం పంట తప్ప మరేమీ పండదు. కృతజ్ఞతలు తెలిపేవారి కొరకుగాను మేము ఈ విధంగా సూచనలను మాటి మాటికీ వివరిస్తూ ఉంటాము." (7:58). ఈ వచనం, భూమిని జాగ్రత్తగా చూసుకోవడం మన ధార్మిక బాధ్యత అని నొక్కి చెబుతుంది.

విశాల సృష్టి : అల్లాహ్ భూమిని "విశాలంగా విస్తరించి" దృఢమైన పర్వతాలు, అందమైన మొక్కలతో సృష్టించాడనే (50:7-8) వర్ణన, నేల అనేది ఒక ఉద్దేశపూర్వకమైన, అద్భుతమైన, సంపూర్ణమైన సృష్టి అని వెల్లడిస్తుంది.

ఈ దైవిక బోధనల ప్రకారం, నేలను రక్షించడం అనేది కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు, ఇది సృష్టికర్త ఆజ్ఞలను పాటించడం, మన మూలాన్ని గౌరవించడం అవుతుంది.

జీవనాధారమైన 9 కారణాలు

నేల దైవిక ప్రాముఖ్యతకు, ఆధునిక శాస్త్రం దాని అద్భుతమైన పర్యావరణ సేవలను జోడిస్తుంది. నేల అత్యంత ముఖ్యమైన సహజ వనరు కావడానికి గల కారణాలు మన మనుగడకు పునాదులు:

1. ఆహార ఉత్పత్తికి ఆధారం : నేల మన ఆహారానికి మూలం. నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలను అందించడమే కాక, నేలలోని సూక్ష్మజీవులు సేంద్రీయ పదార్థాన్ని విచ్ఛిన్నం చేసి, నేలను సారవంతం చేస్తాయి. ఆరోగ్యకరమైన నేల మెరుగైన పరాగ సంపర్కానికి మరియు తెగుళ్లను అణచివేయడానికి కూడా సహాయ పడుతుంది.

2. నీటి వడపోత, నిల్వ : నేల ఒక సహజమైన వడపోత వ్యవస్థ. ఇది భారీ లోహాలు, పురుగు మందుల వంటి కాలుష్య కారకాలను బంధిస్తుంది, తద్వారా మన నీటి వనరులను శుద్ధి చేస్తుంది. పెద్ద మొత్తంలో నీటిని నిల్వ చేయగల సామర్థ్యం వల్ల వరదలను నివారించడానికి మరియు కరువు ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది.

3. జీవులకు నివాసం : నేల అనేది లక్షల జీవులకు నిలయం. వానపాములు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు విచ్ఛిన్నకారులుగా పనిచేసి, నత్రజని స్థిరీకరణ వంటి ప్రక్రియల ద్వారా మొక్కల పెరుగుదలకు కీలకమైన పోషకాలను అందుబాటులో ఉంచుతాయి.

4. పోషకాల నిల్వ : నేల అవసరమైన పోషకాలకు సహజ నిల్వగా పనిచేస్తుంది, వీటిని మొక్కలు ఉపయోగించు కుంటాయి. ఇది పోషకాలు కొట్టుకుపోవడాన్ని (leaching) నిరోధిస్తుంది, పర్యావరణంలో పోషక నిలుపుదలకు సహాయపడుతుంది.

5. వాతావరణ నియంత్రణ : నేల ఉష్ణోగ్రత, తేమ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది సౌర వికిరణాన్ని గ్రహించి, గ్లోబల్ వార్మింగ్ రేటును తగ్గించడంలో సహాయపడుతుంది.

6. కాలుష్యాన్ని శుభ్రం చేయడం : సరైన పరిస్థితుల్లో, నేల కాలుష్య కారకాలను గ్రహించి, విచ్ఛిన్నం చేయగలదు. చమురు తెట్టులను శుభ్రం చేయడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

7. శక్తి ఉత్పత్తి : నేలను బయోగ్యాస్ ఉత్పత్తికి, భూ ఉష్ణ శక్తి ఉత్పత్తికి ఉపయోగించవచ్చు, ఇది పునరుత్పాదక శక్తి వనరులకు దోహదపడుతుంది.

8. మన మనుగడకు కేంద్రం : మన ఆహారం, ఆక్సిజన్, నీటి శుద్ధి నేల ద్వారానే జరుగుతాయి. గతంలో నేల క్షీణత కారణంగానే మానవ సమాజాలు పతనమయ్యాయి కాబట్టి, ఆరోగ్యకరమైన నేల మన మనుగడకు ప్రాథమిక అవసరం.

★★★

మన బాధ్యత

నేల అనేది మనకు దైవదత్తమైన ఒక అద్భుతమైన బహుమతి, ఇది బహిరంగంగా, రహస్యంగా మనకు శుభాలను అందిస్తుంది. "భూమిలోనూ, ఆకాశాలలోనూ ఉన్న సకల వస్తువులను అల్లాహ్ మీకు వశం చేసిన విషయాన్నీ తన గోచర, అగోచర వరాలను మీకు ఇచ్చిన విషయాన్నీ మీరు చూడటం లేదా?" (ఖుర్ఆన్ 31:20). నేల క్షీణిస్తే, మన ఆహారం, నీరు, గాలి మరియు చివరికి మన అస్తిత్వం కూడా ప్రమాదంలో పడుతుంది.

ఇది కేవలం కొద్దిమంది శాస్త్రవేత్తలు లేదా రైతులకు మాత్రమే సంబంధించిన విషయం కాదు; ఇది మనందరి బాధ్యత. నేలను నిర్లక్ష్యం చేయడం అంటే మన మూలాన్ని, భవిష్యత్తును విస్మరించడమే. ఈ జీవనాధారమైన వనరును కాపాడుకోవడానికి, దాని పవిత్రతను గౌరవించడానికి, దానిని రాబోయే తరాలకు ఆరోగ్యంగా అందించడానికి మనం ప్రతిజ్ఞ చేద్దాం.

నేల మన మనుగడకు కేంద్రం. దానిని రక్షించుకుందాం!

నియంత్రణ అవసరం

- ముహమ్మద్ హసన్ అలీ

మానవ చరిత్రలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ఈ డిజిటల్ యుగంలో మన పిల్లల భవిష్యత్తు గురించి ఒక కీలకమైన ప్రశ్న ఉత్పన్నమవుతోంది: వారి బాల్యం డిజిటల్ తెరల వెనుక బందీగా మారుతోందా?

సమాచారాన్ని, ప్రపంచాన్ని అరచేతిలోకి తీసుకొచ్చిన సోషల్ మీడియా, అదే స్థాయిలో ప్రమాదాలను కూడా వెంట తెచ్చింది. చిన్నారి మెదళ్లు ఇంకా ఈ వేగవంతమైన ప్రపంచాన్ని తట్టుకునే శక్తిని పెంచుకోకముందే, అల్గారిథమ్‌ల ఉచ్చులో చిక్కుకుని, మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మలేషియా వంటి దేశాలు సోషల్ మీడియా వయస్సు పరిమితిని 16 ఏళ్లకు పెంచాలనే కీలక నిర్ణయాలు తీసుకోవడం, ఆస్ట్రేలియా డిసెంబర్ 10 నుండి నిషేధాన్ని అమలు చేయడం, యూఎస్ సర్జన్ జనరల్ నియంత్రణ విధానాలను బలోపేతం చేయాలని కోరడం... ఇవన్నీ కూడా మన యువతను రక్షించాల్సిన అనివార్యమైన ఆవశ్యకతను స్పష్టం చేస్తున్నాయి.

బాల్యంపై డిజిటల్ నీడ: మానసిక క్షోభ

సోషల్ మీడియా ప్రభావం కేవలం వినోదానికే పరిమితం కాలేదు, అది పిల్లల మానసిక ఆరోగ్యంపై లోతైన ముద్ర వేస్తోంది. వారి సున్నితమైన బాల్యం అనేక దుష్ప్రభావాలకు గురవుతోంది:

పోలిక, ఒంటరితనం (FOMO) : తమ స్నేహితులు, ఇతరుల 'హైలైట్ రీల్స్' చూసి, తమ జీవితాలు అంత బాగుండటం లేదనే భావన (Fear of Missing Out - FOMO) లోకి పిల్లలు నెట్టబడుతున్నారు. ఇది వారిలో తీవ్రమైన ఆందోళన, డిప్రెషన్‌కు దారితీస్తోంది.

సైబర్‌బుల్లింగ్ - 24/7 వేధింపు : పాఠశాల ఆవరణలోనే ఉండే వేధింపులు ఇప్పుడు స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా ఏకధాటిగా వారి గదుల్లోకి ప్రవేశిస్తున్నాయి. అనామక ఖాతాల నుండి వచ్చే నిరంతర వేధింపులు కొందరిని విపరీతమైన భావోద్వేగ సంక్షోభంలోకి, చివరకు ఆత్మహత్య ప్రయత్నాల వైపు కూడా నెట్టిన విషాద ఉదాహరణలు మన కళ్ల ముందు ఉన్నాయి.

శరీర ఆకృతి పట్ల ఆందోళన : ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి వేదికల్లో కనిపించే వాస్తవం కాని (Unrealistic) అందం ప్రమాణాలను చూసి, పిల్లలు తమ శరీరం ఆకృతి పట్ల ఆందోళన చెందుతున్నారు. ఇది తినే రుగ్మతలకు (Eating Disorders) దారితీసే ప్రమాదం ఉంది.

నిద్రలేమి, ఏకాగ్రత లోపం : నిరంతర నోటిఫికేషన్‌లు వారి నిద్రను దెబ్బతీసి, పాఠశాలలో వారి ఏకాగ్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

కార్పొరేట్ స్వార్థం : పిల్లల శ్రేయస్సు

సోషల్ మీడియా కంపెనీలు ఈ పరిణామాల గురించి తెలిసి కూడా, తమ వ్యాపార ప్రయోజనాల కోసం ఈ వాస్తవాలను ఉద్దేశ పూర్వకంగా విస్మరిస్తున్నాయని కోర్టు పత్రాలు, అంతర్గత పరిశోధనలు సూచిస్తున్నాయి. మెటా వంటి దిగ్గజాలు, తమ ప్లాట్‌ఫారమ్‌ను డీయాక్టివేట్ చేయడం వలన మానసిక ఆరోగ్యం

మెరుగుపడిందనే పరిశోధన ఫలితాలను రద్దు చేశారనే నివేదిక, వారి స్వార్థ ప్రయోజనాలను స్పష్టంగా తెలియజేస్తోంది. భారతదేశం వంటి యువ వినియోగదారుల పెద్ద మార్కెట్‌లో ఎటువంటి నియంత్రణ లేకుండా వ్యాపారం యథావిధిగా కొనసాగితే, అది తీవ్రమైన సామాజిక, మానసిక హానిని కలిగిస్తుంది.

భారత్‌కు తప్పనిసరి చర్యలు

ప్రపంచ దేశాలు తీసుకుంటున్న కఠిన చర్యల సరసన భారతదేశం కూడా చేరాల్సిన సమయం ఆసన్నమైంది. సోషల్ మీడియా కంపెనీల స్వార్థ ప్రయోజనాల కంటే మన పిల్లల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఇది. కేవలం నిషేధ చట్టాలతో సరిపెట్టకుండా, ఈ క్రింది సమగ్ర విధానాలపై దృష్టి పెట్టాలి:

కఠిన వయో ధృవీకరణ (Age Verification) : కనీస వయస్సు నిబంధనలను బలోపేతం చేయాలి, కఠినంగా అమలు చేయాలి.

వేదికల జవాబుదారీతనం : డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు తమ వినియోగదారుల భద్రతకు బాధ్యత వహించేలా కఠిన నిబంధనలను తీసుకురావాలి. ఆస్ట్రేలియా విధించిన భారీ జరిమానాలు వారికి ఒక హెచ్చరికగా ఉండాలి.

డిజిటల్ అక్షరాస్యత (Digital Literacy) విద్య : పిల్లలకు, తల్లిదండ్రులకు ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఎలా ఉండాలో, వివేకంతో కూడిన నిర్ణయాలు ఎలా తీసుకోవాలో బోధించే డిజిటల్ ఆరోగ్యం, భద్రతను పాఠశాల పాఠ్యప్రణాళికలో చేర్చాలి.

తల్లిదండ్రుల చురుకైన పాత్ర : తల్లిదండ్రులు తమ పిల్లల డిజిటల్ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి, పరిమితులను విధించాలి, చర్చకు సిద్ధంగా ఉండాలి.

మలేషియా కమ్యూనికేషన్స్ మంత్రి ఫహ్మీ ఫడ్జిల్ అన్నట్లుగా, "ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు, తల్లిదండ్రులు అందరూ తమ పాత్రలను పోషిస్తే" మాత్రమే ఇంటర్నెట్ సురక్షితంగా ఉంటుంది. చట్టపరమైన నియంత్రణ, సాంకేతిక పరిష్కారాలు, విద్యను కలిపి పనిచేయాల్సిన సమయం ఇది.

మన పిల్లల హృదయానికి హాని కలగకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. డిజిటల్ తెరల వెనుక నలిగిపోతున్న బాల్యానికి, ప్రేమతో కూడిన సురక్షా కవచాన్ని అందిద్దాం!

ఉషోదయం పిలుపు: ఆయువును పెంచే అమృత వేళ

కొత్త అధ్యయనాలు చెబుతున్న ఈ మాట వింటే మన మనస్సు ఎంతో తేలికపడుతుంది. చీకటి తెర తొలగక ముందే, ఆ సూర్యోదయ కాంతి తొలి కిరణాలు భూమిని తాకక ముందే మనం మేల్కొనడం ఎంతటి అద్భుతమో! ఆ పవిత్ర వేళలో మేల్కొనడం వల్ల మన ఆయుష్షు పెరుగుతుందట! మనలోని ప్రతి కణం కొత్త ఉత్సాహంతో, రెట్టింపు చురుకుదనంతో పని చేయడం ప్రారంభిస్తుందట. అంతేకాదు, మన ఆలోచనలు, మన గ్రహణశక్తి, మన మానసిక సామర్థ్యాలు కూడా పదునెక్కి, అద్భుతంగా మెరుగుపడతాయట!

శాస్త్రవేత్తలు చెబుతున్న మరొక మాటేమిటంటే... రాత్రి 10 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు కేవలం ఆరు గంటలు నిద్రపోతే చాలు, అది పగటిపూట 12 గంటలు నిద్రపోయినంత విశ్రాంతిని, శక్తిని ఇస్తుందట. రాత్రి నిద్ర అంత పవిత్రమైనది!

ఈ సత్యాన్ని ఆనాడే ప్రవక్త ముహమ్మద్(స) ఎంత ప్రేమగా మనకు బోధించారో కదా! మన శ్రేయస్సు కోరే, మన ప్రవక్త(స)... ఆ ప్రశాంతమైన ఫజ్ర్ వేళలో మేల్కొని, అల్లాహ్‌ను ప్రార్థించాలని మనకు ఆదేశించారు.

రాత్రి చీకటికి ఎంత గొప్ప విలువ ఉందో, అది మనకు ఎంత గొప్ప ఉపకారం చేస్తుందో అల్లాహ్ ఎంతో దయతో మనకు వివరించాడు. ఈ రాత్రి అనేది ఆదర్శవంతమైన, హాయినిచ్చే విశ్రాంతికి మార్గం. అంతేకాక, ఇది మనల్ని శారీరక, మానసిక అలజడుల నుండి కాపాడే ఒక రక్షణ కవచం లాంటిది.

ఆ కరుణామయుడైన అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో మనల్ని ఉద్దేశించి ఎంత మధురంగా సెలవిచ్చాడో చూడండి:

"మీ కొరకు రాత్రిని వస్త్రంగానూ, నిద్రను మృత్యు శాంతిగానూ, పగలును బ్రతికిలేచే సమయంగాను చేసినవాడు అల్లాహ్‌యే."
(అల్-ఫుర్ఖాన్: 25: 47)

ఈ రాత్రి చీకటి మనకు విశ్రాంతిని ఇచ్చే ఆ దైవ దయ! ఉదయం మేల్కొనడం కొత్త జీవితాన్ని అందించే ఆ దైవ కానుక!

- షేక్ హసన్ సాహెబ్

కస్టడీ మరణాల దర్యాప్తులో భారీ జాప్యం

కస్టడీ మరణాల దర్యాప్తులో లోతైన వ్యవస్థాగత అంతరాలున్నాయని జైలు సంస్కరణలపై ఏర్పాటైన సుప్రీంకోర్ట్ ప్యానెల్ సమగ్ర నివేదిక వెల్లడించింది. వివిధ రాష్ట్రాల ఫోరెన్సిక్ ల్యాబ్స్‌లో 52 శాతం పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల ఫోరెన్సిక్ పరీక్షల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపింది. దీని కారణంగా డిసెంబర్ 31, 2023 నాటికి 1237 కస్టడీ మరణాల విచారణ జిల్లా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. కొన్ని జైళ్లలో కులాల ఆధారంగా ఖైదీలకు విధులను కేటాయిస్తున్నారని నివేదిక తెలిపింది. ఖైదీలు చేసే పనులకు చెల్లించే రోజువారీ వేతనాల్లో భారీ వ్యత్యాసాలున్నాయని.. మిజోరంలో రూ.20 ఉండగా, కర్ణాటకలో రూ.524గా ఉందని వివరించింది. ఖైదీల మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించే చర్యలు సరిగా లేవని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. జైల్లోని వైద్యుల్లో చాలా మందికి మానసిక ఆరోగ్యంపై శిక్షణ ఇవ్వలేదని తెలిపింది. ఇది 2018 మానసిక ఆరోగ్య చట్టాన్ని ఉల్లఘించడమేనని పేర్కొంది.

53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నవంబర్ 24న రాష్ట్రపతి భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. ఆయన హిందీలో దేవుని సాక్షిగా ప్రమాణం చేశారు. ఈ పదవిలో ఆయన 2027 ఫిబ్రవరి 9 వరకు దాదాపు 15 నెలలపాటు కొనసాగుతారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. జస్టిస్ కాంత్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రధాని మోదీ వద్దకు వెళ్లి, నమస్కరించారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని హిసార్ జిల్లాలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. కురుక్షేత్ర విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. చిన్న పట్టణంలో న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఆ తర్వాత అంచెలంచెలుగా దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత పదవిని చేపట్టారు.

సిమ్ కార్డు దుర్వినియోగమైతే మీదే బాధ్యత.. టెలికం విభాగం హెచ్చరిక

మీ పేరుతో ఉన్న సిమ్ కార్డు మిమ్మల్ని కోర్టులో నిలబెట్టొచ్చని టెలికం విభాగం హెచ్చరించింది. చాలామంది సరదా కోసమో లేక తాము అనుకున్న నంబర్ కోసమో ఎడాపెడా సిమ్ కార్డులు కొనేస్తుంటారు. కొంతమంది అప్పుల వారి బారి నుంచి తప్పించుకొనేందుకు మాటిమాటికీ సిమ్ కార్డులు మారుస్తుంటారు. ఇలా నంబర్ మార్చుకున్న తరువాత పాత సిమ్‌కార్డుల గురించి పట్టించుకోరు. అవి ఎవరైనా నేరగాడి చేతిలో పడితే అవి దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని, వారి నేరానికి మీరు శిక్ష అనుభవించవలసి రావచ్చని టెలికం విభాగం సూచించింది. మీ పేరుతో ఉన్న సిమ్ కార్డుతో సైబర్ నేరం జరిగినా లేక ఏదైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వాడినా మీరే జవాబుదారీ అవుతారని తెలిపింది.

2027 జనాభా గణనకు సిద్ధం..! మిమ్మల్ని అడిగే ప్రశ్నలు ఇవే..!

కొత్త ఏడాది 2027 జనాభా గణన ప్రారంభం కాబోతున్నది. ఎన్యుమరేటర్లు ఇండ్లకు చేరుకొని సమాచారం సేకరిస్తారు. సర్వేయర్లంతా మీ ఇంటి నిర్మాణం నుంచి దాని ఉపయోగం వరకు ప్రతిదాని సమాచారం సేకరించనున్నారు. ఉదాహరణకు సౌరశక్తి నుంచి ఇంటర్నెట్ వినియోగం వరకు ప్రతిదానిపై సమాచారాన్ని కోరనున్నారు. ఇంటి నేల, పైకప్పు, గోడలు దేనితో తయారు చేశారు? ఇల్లు నివాసంగా ఉపయోగిస్తున్నారా? కార్యాలయమా..? గెస్ట్‌హౌసా? ప్రార్థన స్థలం కూడా ఉందా?.. కాలువ, నది, బావి, చేతిపంపు, నల్లాల ద్వారా నీరు అందుతుందా? ప్యాకేజ్డ్, సీసాల్లో నీటిని ఉపయోగిస్తారా? అనే సమాచారాన్ని సేకరించనున్నారు. అలాగే, టెలిఫోన్లు, స్మార్ట్‌ఫోన్ల గురించిన సమాచారం కూడా సేకరించనున్నారు. దీని ఉద్దేశం కేవలం దేశ ప్రజల జీవన ప్రమాణాలు అర్థం చేసుకోవడమే. డేటా అభివృద్ధి చెందిన భారత ప్రచారంలో కొత్త విధానాలను రూపొందించడంలో, ఇప్పటికే ఉన్న విధానాల్లోని లోపాలను సరిదిద్దడంలో సహాయపడనున్నది. 2027 జనాభా లెక్కల మొదటి దశ కోసం గృహాల జాబితా, గృహాల గణన షెడ్యూల్ జాబితాను తయారు చేసే ప్రచారాన్ని కేంద్రం ముమ్మరం చేసింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరుగనుండగా.. ఇందు కోసం 30కిపైగా ప్రశ్నల జాబితా సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో జారీ చేయనున్నారు.

డేంజర్ బెల్స్.. ఓజోన్ కాలుష్యంతో ఊపిరితిత్తులకు ముప్పు..!

పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న ఓజోన్ కాలుష్యంపై సీపీసీబీ (CPCB) నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (NGT)కి కీలక నివేదిక సమర్పించింది. తక్షణం చర్యలు తీసుకోకపోతే ఊపిరితిత్తుల వ్యాధులు, ఉబ్బసం కేసులు వేగంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. పంటలకు సైతం గణనీయమైన నష్టం జరిగే అవకాశం ఉందని చెప్పింది. వాహనాల ఉద్గారాలను తగ్గించడం, కర్మాగారాల్లో ఫిల్టర్ల ఏర్పాటు, నగరాల్లో చెట్లను నాటించాలని బోర్డు సిఫారసు చేసింది. నివేదిక ప్రకారం, వేసవిలో ఓజోన్ కాలుష్యం మరింత తీవ్రమవుతుంది. ఏప్రిల్-జూలై 2023లో ఢిల్లీలో ఆరు, ముంబయిలో మూడు సహా పది మానిటరింగ్ స్టేషన్లలో వాయిలేషన్స్ రికార్డయ్యాయి. ఈ సంఖ్య 2024లో 24 స్టేషన్లకు బాగా పెరిగింది. ఇందులో ఢిల్లీలో 21, చెన్నైలో రెండు, హైదరాబాద్‌లో ఒకటి ఉన్నాయి. రాత్రిపూట కూడా ప్రమాదం తగ్గడం లేదని నివేదిక పేర్కొంది.

ఆమెపై హింస అరికట్టడానికి ప్రభుత్వానికి స్పష్టమైన లక్ష్యం లేదు : ప్రపంచ ఆరోగ్య సంస్థ

ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికలపై హింస విస్తృతంగా వ్యాపించిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించిది. 15-49 ఏండ్ల మహిళల్లో 8.4% మంది భాగస్వామి నుంచి లైంగిక హింసకు గురయ్యారని నివేదిక చెబుతుంది. భారతదేశంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. 2030 నాటికి హింసను నిర్మూలించే లక్ష్యంపై స్పష్టత లేదని ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపింది. ఆత్మహత్యలను నివారించడంలో వ్యవస్థల వైఫల్యం, యువత ఒంటరితనం, నిస్సహాయత వంటి సమస్యలను పరిష్కరించాలి అని నివేదిక పేర్కొంది. ప్రభుత్వాలు అవగాహన పెంచి, నిధులు కేటాయించాలని సూచించింది.

మానసిక రుగ్మతలు పెరుగుతున్నాయ్

ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడుగురిలో ఒకరు మానసిక రుగ్మతతో జీవిస్తుండగా.. భారత్‌లో ప్రతీ 100 మందిలో 11 మందికి ఈ సమస్యలు ఉన్నట్లు నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే స్పష్టం చేసింది. అలాగే ప్రతీ 100 మందిలో 14 మంది తమ జీవితకాలంలో ఎప్పుడో ఒకసారి మానసిక సమస్యను ఎదుర్కొన్నట్లు తేలింది. గ్రామాల్లో 6.9% మంది బాధితులు ఉండగా, పట్టణాల్లో ఈ సంఖ్య 13.5 శాతంగా ఉంది. అలాగే, మానసిక రుగ్మతలు పురుషుల (10%) కంటే మహిళల్లో (20%) అధికంగా ఉన్నట్లు స్పష్టమైంది. మహిళల్లో నిరాశ, ఆందోళన వంటి సమస్యల కారణంగా మానసిక రుగ్మతలు పెరుగుతున్నట్లు తేలింది. ప్రత్యేకంగా 15-29 ఏళ్ల మధ్య ఉన్న వారిలో నిరాశ, ఆందోళన లాంటి మానసిక సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు డబ్ల్యూహెచ్ఓ నివేదిక తెలిపింది. మానసిక సమస్యల్లో నిరాశ 6.2%, ఆందోళన 4.7% ప్రధానమైనవిగా మెంటల్ హెల్త్ అట్లాస్ పేర్కొంది.

మలేషియాలో పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం

పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు మలేషియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది నుంచి 16ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించకుండా నిషేధం విధించనుంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ దేశ కమ్యూనికేషన్ శాఖ మంత్రి ఫాహ్మి ఫడ్జిల్ తెలిపారు. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాల నుంచి పిల్లల్ని కాపాడేందుకు.. ఆస్ట్రేలియా, డెన్మార్క్, నార్వే వంటి దేశాలు ఇప్పటికే ఈ తరహా బ్యాన్‌ను అమలులోకి తేవాలని పరిశీలిస్తున్నాయి. వయసు ధ్రువీకరణ కోసం ఆయా దేశాలు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

యూరప్‌ను భయపెడుతున్న జనాభా తగ్గుదల..

జనాభా తగ్గుదల యూరప్ దేశాలను భయపెడుతోంది. రికార్డు స్థాయిలో యూరప్ దేశాల్లోని జనాభా శాతం కిందకు పడిపోయింది. మొత్తం అన్ని యూరప్ దేశాల్లో కలిపి 2024లో కేవలం 318,005 మంది పిల్లలు మాత్రమే పుట్టారు. 1941 తర్వాత ఇంత తక్కువ సంఖ్యలో పిల్లలు పుట్టడం ఇదే మొదటి సారి. ఫెర్టిలిటీ రేటు 1.10 శాతానికి పడిపోయింది. ఇలా జరగడానికి ప్రధాన కారణం ఆడవారే. యూరప్ దేశాల్లోని ఆడవారు పెళ్లిళ్లు చేసుకోవటం ఆలస్యం చేస్తున్నారు. పిల్లల్ని కూడా లేటుగా కంటున్నారు. కాస్ట్ ఆఫ్ లివింగ్, కెరీర్‌ను దృష్టిలో పెట్టుకుని ఆడవారు పెళ్లిళ్లు, పిల్లలకు దూరంగా ఉంటున్నారు. ఇటలీతో పాటు పోలాండ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. యువకుల జనాభా తగ్గుతుంటే వృద్ధుల జనాభా పెరుగుతూ పోతోంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థపై దారుణమైన ప్రభావం పడుతోంది.

హృదయంలో దాగి ఉన్న అద్భుత శక్తి : కృతజ్ఞత!

- సల్మాన్ అష్ఫల్

ప్రపంచం వేగంగా పరిగెడుతున్న ఈ తరుణంలో, మన దృష్టి ఎప్పుడూ 'మనకు లేని' దానిపైనే ఉంటుంది. ఇతరుల సౌకర్యాలు, ఇంకా సాధించాల్సిన లక్ష్యాలు... ఈ 'లేమి' అనే సుడిగుండంలో పడి, మన చుట్టూ అద్భుతంగా ఉన్న వరాలను మనం తరచుగా విస్మరిస్తుంటాం. కానీ సమస్త సంతోషానికి మూలం, మన జీవితంలోని ప్రతికూలతను సైతం సానుకూల శక్తిగా మార్చగలిగే ఆ అద్భుతమైన శక్తి. అదే కృతజ్ఞత (షుకర్).

ఇస్లాంలో కృతజ్ఞత కేవలం ఒక మంచి అలవాటు మాత్రమే కాదు, అది ఆరాధన యొక్క మూలస్తంభం. కృతజ్ఞత అనేది క్యాలెండర్‌కు పరిమితం కాని ప్రతిరోజూ చేసే ఆరాధన.

అల్‌హందులిల్లాహ్: ప్రతి ఉదయం ఒక గొప్ప అవకాశం

మనం కళ్ళు తెరిచే ప్రతి ఉదయం ఒక కొత్త అవకాశం. చీకటిని చీల్చుకొని, మనకు మళ్లీ జీవం పోసిన ఆ సర్వశక్తిమంతుడికి కృతజ్ఞతలు చెబుతూ, "అల్‌హందులిల్లాహిల్లజి అహ్యానా బా'ద మా అమాతనా వ ఇలైహిన్-నుషూర్" అని పలకడం ఎంతటి ఆధ్యాత్మిక అనుభూతిని ఇస్తుంది! ఈ ఒక్క మాట మన జీవితం దేవుని దయతో ప్రారంభమైందని, ప్రతి శ్వాస ఒక మహా వరం అని తెలియజేస్తుంది. తాగడానికి నీళ్లు, తినడానికి తిండి, తలపై సురక్షితమైన పైకప్పు దొరకడం సాధారణ విషయాలు కావు. పూర్తి ఆరోగ్యంగా ఉండడం అంటే, మిత్రమా, మీరు ఈ ప్రపంచంలో అత్యంత అదృష్టవంతులలో ఒకరు!

దైవ వాగ్దానం, అంతర్గత శక్తి

దురదృష్టకర సంఘటనలు మనల్ని నిరాశపరుస్తున్నప్పటికీ, కృతజ్ఞత మన కష్టాలను చూసే వైఖరిని మారుస్తుంది. అది మనకు అంతర్గత శక్తిని ఇచ్చి, సమస్యల నుండి బయటపడటానికి పరిష్కారాలను వెతకడానికి ప్రేరేపిస్తుంది. మన ప్రియమైన ప్రవక్త ముహమ్మద్ (స) పాదాలు ఉబ్బే వరకు నిలబడి ప్రార్థిస్తూ, "నేను అల్లాహ్‌కు కృతజ్ఞుడైన దాసుడిగా ఉండకూడదా?" అని అడగడం కృతజ్ఞతా శక్తిని తెలియజేస్తుంది.

దేవుడు (అల్లాహ్) మనకిచ్చిన వాగ్దానం ఎంత శక్తివంతమైనదంటే:

"మీరు గనక కృతజ్ఞులైతే, నేను మిమ్మల్ని ఇంకా ఎక్కువగా అనుగ్రహిస్తాను. ఒకవేళ కృతఘ్నుతకు పాల్పడితే నా శిక్ష చాలా కఠినంగా ఉంటుంది" (సూరహ్ ఇబ్రాహీమ్ 14:7)

ఈ దైవ వాక్యం కృతజ్ఞత అనేది మన జీవితంలో వృద్ధిని ఆకర్షించే అయస్కాంతం అని తెలియజేస్తుంది. మనం కృతజ్ఞతతో ఉన్నప్పుడు, మనకు ఇంకా ఎక్కువ వరాలను ఇవ్వడానికి దేవుడు సిద్ధంగా ఉంటాడు.

మనుషులకు కృతజ్ఞతలు : దైవారాధనలో భాగం

కృతజ్ఞత కేవలం దేవునికే కాదు, మన చుట్టూ ఉన్న మనుషులకు కూడా చూపాలి. "ఎవరైతే ప్రజలకు కృతజ్ఞతలు చెప్పరో, వారు అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పరు," అన్న ప్రవక్త వాక్కు లోతైన అర్థం ఏమిటంటే, ఇతరుల పట్ల దయ, అభినందన చూపడం కూడా దైవారాధనలో భాగమే. ఒక చిరునవ్వు, ఒక సహాయం, ఒక మంచి మాట... వీటికి "కృతజ్ఞతలు" చెప్పడం ద్వారా మనం సర్వశక్తి మంతుడైన దేవుని ఆజ్ఞను పాటించినట్లే అవుతుంది.

కృతజ్ఞత కేవలం మానసిక భావన కాదు, ఇది:

మనశ్శాంతిని పెంచుతుంది.

రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది.

బంధాలను మరింత బలంగా మారుస్తుంది.

పోరాట పటిమను (Resilience) పెంపొందిస్తుంది.

ప్రతిరోజూ కృతజ్ఞతను సాధన చేయండి

కృతజ్ఞతను అలవాటుగా మార్చుకోవడానికి నిలకడ అవసరం. దీనిని ప్రతి నిత్యం ఒక చిన్న ఆచారంగా మార్చుకుందాం.

కృతజ్ఞతా డైరీ : పడుకునే ముందు మీకు లభించిన మూడు, నాలుగు మంచి క్షణాలను రాయండి. ఇది మీ జీవితంలోని ఆనందాల నిధి అవుతుంది.

అభినందన లేఖలు : మీ జీవితంలో మార్పు తెచ్చినవారికి హృద్యమైన లేఖల ద్వారా లేదా మౌఖికంగా కృతజ్ఞతలు చెప్పండి.

గత గాయాలను పాఠాలుగా మార్చడం : గతాన్ని దురదృష్టంగా కాకుండా, ఎదుగుదలకు దోహదపడిన పాఠంగా స్వీకరించండి.

కృతజ్ఞత అనేది ఒక తాళం చెవి. అది మీ జీవితంలోని సంతృప్తి అనే తలుపును తెరుస్తుంది. ఈ చిన్న అభ్యాసాన్ని మీ దినచర్యలో భాగంగా మార్చుకోండి. మీ ఒత్తిడి అదృశ్యమవడం, మీ బంధాలు బలోపేతం అవ్వడం, మీ హృదయం అంతులేని సంతోషంతో నిండిపోవడం మీరు గమనిస్తారు.

ప్రతి పరిస్థితిలోనూ మన హృదయాలలో ఈ నినాదం ప్రతిధ్వనించాలి: "అల్‌హందులిల్లాహి 'అలా కుల్లి హాల్'- ప్రతి పరిస్థితిలోనూ అల్లాహ్‌కే సమస్త స్తోత్రాలు!

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**